


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు






# డిప్యూటీ సీఎంకు సీఎం పరామర్శ

**పవన్‌ను స్వయంగా కలిసి ఆరోగ్యంపై ఆరా తీసిన చంద్రబాబు - భేటీలో ప్రధాని పర్యటన, ఆటో డ్రైవర్ల సేవలో, జీఎస్టీ ఉత్సవ్‌పై చర్చ**

హైదరాబాద్ (చైతన్య రథం): తీవ్ర జ్వరంతో బాధపడుతోన్న ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి సీఎం చంద్రబాబు ఆదివారం వెళ్లారు. ఆరోగ్య పరిస్థితిని గురించి పవన్‌కళ్యాణ్‌ను అడిగి తెలుసుకున్నారు. జ్వరంనుంచి ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అక్టోబర్ 4న ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ అంశంపై డిప్యూటీ సీఎంతో చర్చించారు. ఆటో డ్రైవర్ల కోసం చేపట్టే ఈ పథకం కూడా మన్ననలు పొందుతుందనే విశ్వాసం ఉన్నట్టు పవన్ తెలిపారు. జీఎస్టీ 2.0 సంస్కరణలలో భాగంగా రాష్ట్రంలో చేపట్టనున్న జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహణపైనా చర్చించారు.

వచ్చే నెల 16న ప్రధాని మోదీ శ్రీశైలం రానున్న సందర్భంగా రోడ్ షో నిర్వహణ విజయంతం చేసే అంశంపై ఇరువురు నేతలు మాట్లాడుకున్నారు. వీటితోపాటు డీఎస్సీ అంశం కూడా ఇద్దరు నేతల మధ్య చర్చకు వచ్చింది.

మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి ఒకేసారి 15,941మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడాన్ని పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు. ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామక పత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించి యువతలో మనోధైర్యాన్ని, స్ఫూర్తిని నింపారని ముఖ్యమంత్రి చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.

## సంస్కరణల అమలుతో

# ప్రజలకు లబ్ధి

- వ్యవస్థల సక్రమ నిర్వహణతో రాష్ట్రానికి మేలు
- జీఎస్టీ కుదింపు... విద్యుత్ కొనుగోలు అంశాలే నిదర్శనం
- జీఎస్టీ సంస్కరణల లాభాలను ప్రజలకు వివరించాలి
- రాష్ట్రాదాయం తగ్గినా.. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది
- విద్యుత్ వ్యవస్థను కూటమి సర్కారు గాడిన పెట్టింది
- తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు.. ప్రజలకే మేలు



- సుమారు రూ.1000 కోట్లు ఆదా చేయగలిగాం..
- ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని నియత్రిస్తున్నాం
- సాధించిన విజయాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి
- అసెంబ్లీకి వైసీపీ డుమ్మా... మండలిలో డ్రామాలు
- వైసీపీ రాజకీయానికి పునాది.. ఫేక్ ప్రచారమే

2

- పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలతో సీఎం చంద్రబాబు
- భవిష్యత్ కార్యాచరణపై టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం

## నేడు సరస్వతి అలంకరణలో దుర్గమ్మ

- పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు
- భారీగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టిన పోలీసులు

*విజయవాడ (చైతన్య రథం): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం శ్రీ మహాచండీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. బెజవాడ కనకదుర్గను దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. లక్షమంది పైచిలుకు భక్తులు ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్నట్లు అంచనా. ఇదిలావుంటే -సోమవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని అమ్మవారు సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అదే సందర్భంలో మధ్యాహ్నం మ.3.30 గంటలకు అమ్మవారిని ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శించుకోనున్నారు. ప్రభుత్వం తరపున దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో.. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు గట్టి చర్యలు చేపట్టారు.*

## ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్



- అత్యుత్తమ నీటి నిర్వహణ విధానం అనుసరించండి

3

- నీటి వనరుల సంపూర్ణ వినియోగంపై దృష్టి పెట్టాలి
- ప్రతి రిజర్వాయర్, చెరువూ నింపాలి...
- ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు
- కృష్ణా, గోదావరి వరద ప్రవాహాలపై ఆన్‌లైన్ సమీక్ష
- ప్రకాశం బ్యారేజీకు 7 లక్షల క్యూసెక్కుల వరద
- అంచనాలను సీఎంకు వివరించిన అధికారులు

## తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయుడు జాషువా

2

- మంత్రి లోకేష్ నివాళి

నవంబర్ నుంచి..

## యూనిట్ విద్యుత్‌పై 13 పైసలు తగ్గింపు

- భవిష్యత్తులో మరింత తగ్గిస్తాం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

6

## భారత్‌కు.. వీర 'తిలక్'ం!




- మనదే ఆసియా కప్
- ఫైనల్‌లో పాక్ చిత్తు
- టోర్నీలో చివరి వరకూ అజేయంగా టీమిండియా
- తిప్పేసిన కుల్‌దీప్

14

మూలా నక్షత్రం రోజున రద్దీకి తగ్గట్లు

## దుర్గమ్మ సన్నిధిలో భారీ ఏర్పాట్లు

- ఎంతమంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా చర్యలు
- ఏర్పాట్లపై అధికారులతో మంత్రుల బృందం సమీక్ష

6

## దక్షిణ కొరియాలో మంత్రుల బృందం

- సుస్థిర నగరాల అభివృద్ధి విధానాలపై అధ్యయనం

4

చైతన్యరథం

# త్యాగధనుడు భగత్‌సింగ్

**జయంతి సందర్భంగా నివాళి అర్పించిన సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్య రథం): యువతలో జాతీయోద్యమ స్ఫూర్తినింపిన దేశభక్తులు భగత్ సింగ్ ఈ తరానికీ ఏ తరానికీ స్ఫూర్తిదాతేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఎక్స్ వేదికపై ట్వీట్ పెడుతూ.. 'యువతలో చైతన్యం నింపి జాతీయోద్యమానికి ఉత్తేజితుల్ని చేసిన దేశభక్తుడు, తెల్లదొరలకు సింహస్వప్నమై నిలిచి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలొడ్డిన త్యాగధనుడు భగత్‌సింగ్. ఆయన జయంతి సందర్భంగా మహనీయుని స్మరించుకుంటూ.. ఆయన స్మృతికి నివాళి అర్పిస్తున్నాను' అని పేర్కొన్నారు.

# స్మరణీయుడు జాషువా

**జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నివాళి**

అమరావతి (చైతన్యరథం): కులవివక్షపై పోరాడుతూనే.. సాహితీ లోకంలో ప్రజ్వరిల్లిన మహనీయుడు గుర్రం జాషువా అని సీఎం చంద్రబాబు నాయుడ  నివాళి అర్పించారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. 'తన జీవితంలో అడుగడుగునా కులవివక్షను ఎదుర్కొంటూనే, తెలుగు సాహితీలోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి, దళితాభ్యుదయవాది గుర్రం జాషువా. సమసమాజ నిర్మాణ స్ఫూర్తిప్రదాత గుర్రం జాషువా జయంతి సందర్భంగా.. ఆ దార్శనికుని సంఘ సంస్కరణ, పోరాటాన్ని, ఆ మహాకవి సాహితీ సేవను స్మరించుకుందాం' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# గిరిజన రైతుల కృషికి అంతర్జాతీయ గుర్తింపు నిదర్శనం

**- అరకు కాఫీ విజయంపై సీఎం చంద్రబాబు ట్వీట్**

అమరావతి (చైతన్య రథం): అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపుపట్ల ముఖ్యమంరితి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెడుతూ.. "అరకు వ్యాలీ కాఫీ మరో ఘనత సాధించింది. 'చేంజ్‌మేకర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించడం శు భపరిణామం. అరకు కాఫీ తోటల సాగులో గిరిజన రైతులు అవిశ్రాంతంగా.. అంకితభావంతో కృషి చేశారనడానికి ఇది నిదర్శనం. అరకు కాఫీ తోటల సాగులో గిరిజన రైతులు స్థిరమైన ఆదాయాలు సాధిస్తున్నారు. ఫైనాన్షియల్ టాన్స్‌ఫర్మేషన్ విభాగంలో అంతర్జాతీయ గుర్తింపు దక్కడం మరింత ఆనందకరం. గిరిజన రైతుల కృషితో బలమైన సామాజిక స్థానం సాధ్యమైంది. అద్భుతమైన విజయాన్ని దక్కించుకున్న గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషనుకు అభినందనలు' అని పేర్కొన్నారు.

# ప్రాణనష్టం బాధాకరం

**తమిళనాడు ఘటనపై సీఎం చంద్రబాబు విచారం**

అమరావతి (చైతన్య రథం): తమిళనాడులో చోటుచేసుకున్న దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. 'తమిళనాడులోని కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో ప్రాణనష్టం చాలా బాధాకరం. తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు నా హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

# తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయుడు జాషువా

**- మంత్రి లోకేష్ నివాళి**

అమరావతి (చైతన్యరథం): నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఘన నివాళి అర్పించారు. సామాజిక ప్రయోజనం కోసం నూతన ఒరవడితో రచనలు చేసిన జాషువా.. ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చారని కోనియాడారు. సాహిత్య ప్రపంచంలో తన రచనలతో సంచలనం సృష్టించిన పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతి సందర్భంగా తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకుందామని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.

**భగత్‌సింగ్‌కు నివాళి**

దేశ స్వాతంత్ర్యం కోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించిన విప్లవ యోధుడు, ప్రజలను చైతన్యపరిచిన స్ఫూర్తిప్రదాత భగత్ సింగ్ అని మంత్రి లోకేష్ కొనియాడారు. దేశభక్తికి నిలువెత్తు రూపం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి మంత్రి లోకేష్ ఘనంగా నివాళులు అర్పించారు.

# సంస్కరణల అమలుతో ప్రజలకు లబ్ధి

- వ్యవస్థల సక్రమ నిర్వహణతో రాష్ట్రానికి మేలు
- జీఎస్టీ కుదింపు... విద్యుత్ కొనుగోలు అంశాలే నిదర్శనం
- జీఎస్టీ సంస్కరణల లాభాలను ప్రజలకు వివరించాలి
- రాష్ట్రాదాయం తగ్గినా.. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది
- విద్యుత్ వ్యవస్థను కూటమి సర్కారు గాడిన పెట్టింది
- తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు.. ప్రజలకే మేలు
- సుమారు రూ.1000 కోట్లు ఆదా చేయగలిగాం..
- ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని నియత్రిస్తున్నాం
- సాధించిన విజయాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి
- అసెంబ్లీకి వైసీపీ డుమ్మా... మండలిలో డ్రామాలు
- వైసీపీ రాజకీయానికి పునాది.. ఫేక్ ప్రచారమే
- పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలతో సీఎం చంద్రబాబు
- భవిష్యత్ కార్యాచరణపై టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం




అమరావతి (చైతన్య రథం): వ్యవస్థలను గాడిలోపెట్టి... సక్రమంగా నిర్వహించినప్పుడు, సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేసినప్పుడు ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలతో ఆదివారం ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జీఎస్టీ సంస్కరణలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని మించినస్థాయిలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. "జీఎస్టీ సంస్కరణల ఫలాలను ప్రజలకు వివరించేందుకు అక్టోబర్ 19వరకు పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. ప్రచార కార్యక్రమాల్లో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలి. ప్రచారంలో భాగంగా 60 వేల సమావేశాలు నిర్వహించి... 1.6 కోట్ల కుటుంబాలను కలవాలి. జీఎస్టీ 2.0 ప్రయోజనాలను వివరించాలి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు పెద్దఎత్తున లబ్ధి జరుగుతుంది. ఏ సంస్కరణలు వచ్చినా వాటిని వినియోగించుకోవాలి. జీఎస్టీ సంస్కరణలు దేశ చరిత్రలో నూతన అధ్యాయం. గతంలో 4 శ్లాబులుంటే ఇప్పుడు 5, 18 శాతం శ్లాబులకు కుదించారు. ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను ప్రజలకు వివరించి చెప్పాలి. జీఎస్టీ ఉత్సవ్‌లో భాగంగా జీఎస్టీ సంస్కరణలను వివరిద్దాం. పారిశ్రామిక, ఆటోమొబైల్, ఫార్మావంటి రంగాలపై జీఎస్టీ సంస్కరణల ప్రభావం పూర్తిగా కనిపిస్తోంది. ఆ రంగాల అభివృద్ధికి జీఎస్టీ సంస్కరణలు దోహదపడతాయి. ద్విచక్ర వాహనాలు, ఏసీలు, కార్లువంటి వాటిపై జీఎస్టీ బాగా తగ్గింది. మంచి చేసినప్పుడు ప్రజలకు పదేపదే చెప్పినప్పుడే ప్రయోజనం కలుగుతుంది. ప్రయోజనాలు వివరించగలిగినప్పుడే పాలనపట్ల ప్రజలు సానుకూలంగా ఉంటారు. జీఎస్టీ సంస్కరణల కారణంగా ప్రజలు నిత్యం ఉపయోగించే వస్తువుల ధరలు భారీగా తగ్గాయి. తద్వారా మన రాష్ట్ర ప్రజలకు రూ.8 వేల కోట్లు ఆదా అవుతాయి. రాష్ట్రానికి వచ్చే ఆదాయం తగ్గినా సంస్కరణలవల్ల ప్రజలు ఆర్థికంగా బలోపేతమవుతారు. తద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడి కొనుగోలు శక్తి పెరుగుతుంది. ప్రధాని తీసుకున్న జీఎస్టీ 2.0 నిర్ణయంపై ధన్యవాద తీర్మానం చేశాం. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ద్వారా కార్యక్రమం ఏడాదిలో ప్రజలకు ఏం చేశామో వివరించాం. అదే తరహాలో జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమాన్నీ చేపట్టాలి. యోగా డేను మించి జీఎస్టీ ఉత్సవ్‌ను సక్సెస్ చేయాలి" అని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

**విద్యుత్ కొనుగోలులో రూ.1000 కోట్ల ఆదా**

"సంస్కరణలు, వ్యవస్థల సమర్థ నిర్వహణవల్ల లాభాలు ఏస్థాయిలో ఉంటాయో... ప్రజలకు ఎంతటి మేలు జరుగుతుందోననే విషయానికి ప్రత్యక్ష ఉదాహరణలు జీఎస్టీ పన్నుల కుదింపు, తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు అంశాలే. జీఎస్టీ సంస్కరణల వల్ల పన్ను శ్లాబులు కుదింపు ఆచరణలోకి వచ్చింది. విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టి.. తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేపట్టడం వల్ల రూ.1000 కోట్లు ఆదా అయ్యింది. గత ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను నాశనం చేసింది. ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేపట్టింది. దీంతో విద్యుత్ ఛార్జీల కొనుగోలు భారం ప్రజలపై పడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టాం. ఓ ప్రణాళిక ప్రకారం విద్యుత్ కొనుగోలును చేపట్టాం. రాష్ట్ర విద్యుత్ అవసరాలను... డిమాండును దృష్టిలో పెట్టుకుని... ముందుగానే సమీక్షించుకుని తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. దేశంలోని ఇతర రాష్ట్రాలతో మాట్లాడుకుని స్వాపింగ్ విధానాన్ని అవలంభించాం. ప్రణాళికాబద్ధంగా విద్యుత్ కొనుగోలు చేపట్టాం. దీంతో ఈ విధానం ద్వారా దాదాపు వెయ్యి కోట్ల రూపాయలు ఆదా చేయగలిగాం. గతంలో ఎన్నడూలేని విధంగా ట్రూ డౌన్ తెచ్చాం. గతంలో ఎప్పుడు చూసినా... ట్రూ అప్ ప్రతిపాదనలే ఉండేవి. కానీ తొలిసారి ట్రూ డౌన్ వచ్చేలా చేశాం. ఇలా ఆదా చేసిన డబ్బుతో ప్రజలపై భారాన్ని తగ్గిస్తున్నాం. సమర్థతకు... అనుభవానికి వచ్చిన ఫలితమిది. దీనివల్ల ప్రజలపై రూ.1,000 కోట్ల భారం తగ్గింది. ప్రభుత్వ డబ్బులే కదా ఖర్చు అయిపోతే మనకేంటిలే అని అనుకోలేదు. ప్రతి రూపాయిని బాధ్యతాయుతంగా ఖర్చు చేస్తున్నాం. అందుకే వ్యవస్థలను సరిగా నిర్వహించాలని.. సంస్కరణలను స్వాగతించాలని చెబుతున్నా. జీఎస్టీ సంస్కరణల ద్వారా ధరలు ఏవిధంగా తగ్గాయి. విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టి.. సక్రమంగా నిర్వహించడం ద్వారా ప్రజలపై రూ.1000 కోట్ల భారాన్ని తగ్గించగలిగాం. ఇలాంటి విషయాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి" అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

**సూపర్ సిక్స్... సూపర్ హిట్**

"సూపర్ సిక్స్ పథకాలు హిట్టయ్యాయి. ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. మెగా డీఎస్సీ... మెగా హిట్టయ్యింది. నియామకపత్రాలు అందించే కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు వారి కళ్లలో ఆనందం చూసి సంతోషించా. 15 నెలల కాలంలో 4.71 లక్షలమందికి ఉద్యోగాలిచ్చాం. తల్లికి వందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం-2.0వంటి పథకాలు సక్సెస్ చేశాం. అన్న క్యాంటీన్ల ద్వారా పేదల కడుపులు నింపుతున్నాం. మరే ఇతర రాష్ట్రంలోనూ ఇవ్వనన్ని పెన్షన్లు ఏపీలోనే ఇస్తున్నాం. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పంకు నీళ్లు ఇచ్చాం. పోలవరం పూర్తి చేస్తున్నాం. ఇతర సాగునీటి ప్రాజెక్టులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నాం. ఏటా 6 వేల టీఎంసీ సముద్రం పాలవుతున్నాయి. ఒకరోజు సముద్రంలో కలిసే నీటిని ఉపయోగించుకుంటే కరవు అనేది లేకుండా చేయొచ్చు. రోజుకు 150 టీఎంసీ చొప్పున నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. ఇవన్నీ ప్రజలకు వివరించాలి. ఇదే కాకుండా.. అక్టోబర్ 4న ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు పథకాన్ని వర్తింప చేస్తున్నాం. ప్రతి లబ్దిదారునికి రూ.15 వేలు ఇస్తున్నాం. ఇవన్నీ ప్రజలకు వివరించాలి" అని సీఎం సూచించారు.

**ఏ ఎన్నికలొచ్చినా కూటమే గెలవాలి**


"ప్రజలకు మేలు చేసేలా చాలా పథకాలు అందిస్తున్నాం. నిత్యం పేదల గురించే ఆలోచన చేస్తున్నాం. ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజలకు వివరించాలి. నేతలు మొదలుకుని.. కార్యకర్తల వరకు నిత్యం ప్రజల్లో ఉండాలి. ప్రభుత్వం చేసే సంక్షేమాన్ని, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి. మంచి చెడు విడమరిచి చెప్పగలగాలి. వారి కష్టనష్టాల్లో నేతలు భాగం కాగలిగితే.. వాళ్లు సుఖ సంతోషాలతో ఉన్నప్పుడు కూడా మనల్నే గుర్తుంచుకుంటారు. ఏ ఎన్నిక వచ్చినా.. ఏ స్థాయి ఎన్నిక వచ్చినా... కూటమి పార్టీలదే గెలుపు అన్నట్టుగా ఉండాలి. ఎన్నికల సమయంలోనే వెళ్తే ప్రజలూ మెచ్చరు. మనం ఏ పని చేసినా ప్రజామోదం ఉందా..? లేదా..? అనేది చూసుకోవాలి. కార్యకర్తలు, నేతలు ప్రజలతో మంచిగా ఉంటే.. పార్టీకి మంచి మైలేజ్ వస్తుంది. ప్రభుత్వ కార్యక్రమాల అమలుమీద అనునిత్యం ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాం. అదేవిధంగా నేతల పని తీరు మీదా ఫీడ్ బ్యాక్ తెప్పించుకుంటున్నాం. మంచి చేస్తే మరింత ప్రోత్సహిస్తా. పార్టీ, ప్రజల కోసం పని చేసేవారే నాకు దగ్గరవుతారు. మాటలు చెప్పి కాలక్షేపం చేసేవారికి నా దగ్గర స్థానం లేదు" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**తప్పుడు ప్రచారమే వైసీపీ ఆచారం**

"రాష్ట్రంలో ప్రభుత్వంపై ఫేక్ ప్రచారం చేయడమే వైసీపీ పనిగా పెట్టుకుంది. తప్పుడు పోస్టులు పెడుతూ తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి పంపుతున్నారు. వాళ్లు పెట్టే ఒక్క పోస్టుకూ ఆధారం ఉండదు. వ్యక్తిత్వ హననాలకు పాల్పడుతున్నారు. వైసీపీనుంచి గెలిచిన 11మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రారు. మండలిలో మాత్రం రకరకాల డ్రామాలు ఆడుతున్నారు. ప్రభుత్వం చేసే మంచి పనినే కాదు.. వైసీపీ చేసే దుష్ప్రచారాలను.. డ్రామాలను కూడా ప్రజలకు వివరించాలి. ఈ బాధ్యతను నేతలు, కార్యకర్తలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

# ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్

- అత్యుత్తమ నీటి నిర్వహణ విధానం అనుసరించండి
- నీటి వనరుల సంపూర్ణ వినియోగంపై దృష్టి పెట్టాలి
- ప్రతి రిజర్వాయర్, చెరువూ నింపాలి...
- ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు
- కృష్ణా, గోదావరి వరద ప్రవాహాలపై ఆన్‌లైన్ సమీక్ష
- నేడు ప్రకాశం బ్యారేజ్‌కు 7 లక్షల క్యూసెక్కుల వరద
- అంచనాలను సీఎంకు వివరించిన అధికారులు



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో నదీ ప్రవాహాలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. డైనమిక్ ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌తో నీటి వనరుల సంపూర్ణ వినియోగం జరగాలని సూచించారు. ఎగువ రాష్ట్రాలనుంచి వస్తున్న వరద ప్రవాహాలను రియల్ టైంలో అంచనా వేస్తూ.. అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రెయిన్ గేజెస్ ద్వారా కురిసిన వర్షాన్ని లెక్కించి ఫ్లడ్ మేనేజ్‌మెంట్ జరపాలన్నారు. వర్షపాతం, ఎగువ రాష్ట్రాలనుంచి వచ్చే నీటి ప్రవాహాల సమాచారాన్ని విశ్లేషించి సమన్వయంతో అన్ని రిజర్వాయర్లను పూర్తిగా నింపాలని సీఎం ఆదేశించారు. అదేవిధంగా సాధ్యమైనన్ని ఎక్కువ చెరువులను నీటితో నింపాలన్నారు.

**కృష్ణానదికి రేపు 7 లక్షల క్యూసెక్కుల వరద**

కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజ్‌వద్ద ప్రస్తుతం 6.57 లక్షల క్యూసెక్కుల వరద ఉందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వచ్చిన నీటిని వచ్చినట్టు సముద్రంలోకి పంపుతున్నామన్నారు. సోమవారం 7 లక్షల క్యూసెక్కులకుపైగా వరద రావొచ్చని అంచనా వేస్తున్నట్టు వివరించారు. శ్రీశైలంనుంచి వస్తున్న వరదతోపాటు తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద వస్తోందన్నారు. అలాగే అటు గోదావరిలో ధవళేశ్వరంవద్ద ప్రస్తుతం 10.12 లక్షల క్యూసెక్కుల వరద ఉందని.. ఈ వరద ఉధృతి పెరిగి 11.5 లక్షల క్యూసెక్కులకు రావచ్చని అంచనా వేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

**సముద్రంలోకి వేల టీఎంసీ వరద**

కృష్ణా, గోదావరి నదులకు వస్తున్న భారీ వరద కారణంగా వేల టీఎంసీ జలాలు సముద్రంలో కలుస్తోంది. రాష్ట్రంలో అన్ని రిజర్వాయర్లలో కలిపి ప్రస్తుతం 94 శాతం నీటి నిల్వలున్నాయని అధికారులు వివరించారు. పైనుంచి ఇంకా వరద వస్తోన్న కారణంగా నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నామన్నారు.

కృష్ణా నదినుంచి సముద్రంలోకి ఇప్పటివరకు 1089 టీఎంసీ జలాలు వెళ్లాయని వివరించారు. గోదావరినుంచి 3251 టీఎంసీ వరద జలాలు సముద్రంలోకి వెళ్లాయని అధికారులు వివరించారు. సమర్థ నీటి నిర్వహణ, కాల్వల్లో ప్రవాహాలు, చెరువులు నింపే కార్యక్రమంవల్ల భూగర్భ జలాలు పెరిగినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ఏడాదికంటే ఈ ఏడాది భూగర్భ నీటి మట్టం పెరిగిందన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో సరాసరి భూగర్భ నీటిమట్టం 8.43 మీటర్లు ఉందని తెలిపారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది 1.25 మీటర్ల భూగర్భ జలాలు పెరిగాయన్నారు. ముఖ్యంగా రాయలసీమలో గత ఏడాదికంటే 2.07 మీటర్లు భూగర్భ జలాలు పైకి వచ్చినట్టు అధికారులు వివరించారు. ఇంకా వరదలు, వర్షాలున్న కారణంగా... నీటి సమర్థ వినియోగానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

చెరువులు నింపడంతోపాటు భూగర్భ జలాల పెంపునకు అవసరమైన అన్ని ప్రణాళికలూ అమలు చేయాలని ఆదేశించారు. మరోవైపు వరదల కారణంగా ముంపు ఉండే ప్రాంతాల ప్రజలను రియల్ టైం సమాచారంతో అప్రమత్తం చేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో జరిగిన సమీక్షకు ఇరిగేషన్ శాఖ అధికారులు, ఆర్టీజీఎస్ అధికారులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు హాజరయ్యారు.

# బడుగుల వంచనలో మహా ఘనుడు జగన్

- శాసనమండలి సాక్షిగా బహిర్గతమైన బీసీలపై వైసీపీ ద్వేషం
- బీసీ వర్గానికి చెందిన చంద్రయ్య కుటుంబానికి అండగా నిలబడితే ఎందుకు అడ్డుకుంటున్నారు?
- వైసీపీ అనే భూతానికి బీసీలే రాజకీయ సమాధి కడతారు
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్ల (చైతన్యరథం): బడుగులను వంచించడంలో వైసీపీ నిజ స్వరూపాన్ని మరోసారి బయటపెట్టుకుందని పల్నాడు జిల్లా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో హత్యకు గురైన బీసీ వర్గానికి చెందిన చంద్రయ్య కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలబడితే ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. పల్నాడులో అరాచక వాదిగా పేరొంది, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారిని హతమార్చి ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసిన నరహంతకుడు పిన్నెల్లి సుందరరామిరెడ్డిని నాడు నక్సలైట్లు హతమార్చినప్పుడు, నాటి వైఎస్ ప్రభుత్వం అతని కుటుంబానికి వెంటనే ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇచ్చింది. గత జగన్మోహన్ రెడ్డి పాలనలోనే అత్యంత కిరాతకంగా గొంతు కోసి హతమార్చిన బీసీ వర్గానికి చెందిన చంద్రయ్య కుటుంబానికి కూటమి ప్రభుత్వం నేడు అండగా నిలబడితే అది నేరమా? బీసీలకు అండగా నిలబడితే మీరెందుకు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు? చంద్రయ్య కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇస్తే ఏం తప్పు జరిగింది? చంద్రయ్య బీసీ వర్గానికి చెందినవాడు కాబట్టే, శాసనమండలిలో వైసీపీ సభ్యులు బిల్లును అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇది బహిరంగ వాస్తవం. బీసీలకు వైసీపీ వ్యతిరేకమని మరోసారి శాసనమండలి సాక్షిగా నిరూపితమైంది. చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం రాకుండా అడ్డుకొని బీసీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారు. వైసీపీకి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదు. బీసీలను అడ్డుకోవడం వైసీపీకి వికృత క్రీడలా మారింది. బడుగు బలహీన వర్గాలపై వైసీపీకి ద్వేషమే తప్ప ప్రేమ లేదు. ప్రజలు ఈ నాటకం మొత్తం గమనిస్తున్నారు. బడుగు బలహీన వర్గాలను వంచించిన వైసీపీ అనే భూతాన్ని ప్రజలు 2024లో ఒకసారి తరిమి తరిమి కొట్టారు. ఇక రాజకీయ సమాధి కట్టేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారు. ఇకనైనా దుర్బుద్ధిని మాని ఈ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజలకు మంచి చేయాలనే ధోరణి వైసీపీ నేతలకు కలిగించాలని ఆ చండీదేవిని వేడుకుంటున్నానని ఒక ప్రకటనలో బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు.

## గత 15 నెలల్లో..

# 1.41 లక్షల మందికి గుండె శస్త్రచికిత్సలు

- ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా ఉచితంగా నిర్వహణ
- రూ.996 కోట్ల వ్యయం
- మరో 3,402 మందికి గోల్డెన్ అవర్ చికిత్స
- మంత్రి సత్యకుమార్ వెల్లడి



అమరావతి (చైతన్యరథం): ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా గడిచిన 15 నెలల్లో 1.41 లక్షల మంది పేదలకు గుండె సంబంధిత శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దీని కోసం రూ.996 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. మరో 3,402 మందికి రూ.7కోట్ల విలువైన 'గోల్డెన్ అవర్' చికిత్స నిర్వహించినట్లు చెప్పారు. ఈ నెల 29న (సోమవారం) ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మంత్రి సత్యకుమార్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుండె సంబంధిత వ్యాధులకు చికిత్స అందించే ఆస్పత్రుల సంఖ్యను పెంచినట్లు చెప్పారు. 161 ప్రైవేటు ఆస్పత్రులు, 26 ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె సంబంధిత వ్యాధుల చికిత్స ప్రస్తుతం అందుబాటులో ఉందన్నారు. మంగళగిరి ఎయిమ్స్, శ్రీకాకుళంలోని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలోనూ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా గుండె వ్యాధులకు చికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. 2022-23లో కంటే 2024-25లో ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందిన వారి సంఖ్య 13,921 నుంచి 17,500కు పెరిగిందని సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

# నవంబర్ నుంచి.. యూనిట్ విద్యుత్‌పై 13 పైసలు తగ్గింపు

- భవిష్యత్తులో మరింత తగ్గిస్తాం
- సీఎం చంద్రబాబు అనుభవంతోనే కోలుకున్న విద్యుత్ రంగం
- విద్యుత్ శాఖను ఆదాయ వనరుగా మార్చుకున్న జగన్
- వైసీపీ హయాంలో 9 సార్లు విద్యుత్ ఛార్జీల పెంపు.. వ్యవస్థ సర్వనాశనం
- మీడియా సమావేశంలో విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి (చైతన్యరథం): అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం పనిచేస్తోందని విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గత జగన్ ప్రభుత్వం ప్రజలపై మోయలేని విద్యుత్ భారం మోపిందని, ఆ భారాన్ని కూటమి ప్రభుత్వం తగ్గిస్తోందని చెప్పారు. నవంబర్ నెల నుంచి ప్రతి యూనిట్‌పై 13 పైసలు తగ్గిస్తున్నామని, రానున్న రోజుల్లోనూ భారం లేకుండా చేస్తామన్నారు. ఆదివారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ...జగన్ ప్రభుత్వం 9 సార్లు కరెంట్ ఛార్జీలు పెంచింది.. 2019లో తెలుగు దేశం ప్రభుత్వం దిగిపోయే నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా చంద్రబాబు తీర్చిదిద్దారు. కానీ జగన్ వచ్చాక 5 ఏళ్లలో విద్యుత్ వ్యవస్థను నాశనం చేశారు. రూ.1.25 లక్షల కోట్ల మేర అప్పులు ఊబిలోకి నెట్టారని వివరించారు.

**సీఎం చంద్రబాబు అనుభవంతోనే..**

5 ఏళ్లు సీఎంగా ఉండి జెన్కో, ట్రాన్స్‌కో వ్యవస్థలను జగన్ నాశనం చేశారు. వీటీపీఎస్, కృష్ణపట్నంలో విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉన్నా పట్టించుకోలేదు. బయటి రాష్ట్రాల నుంచి ఎక్కువ ఖర్చు చేసి విద్యుత్ కొనుగోలు చేశారు. 2019కు ముందు రెన్యువబుల్ ఎనర్జీలో ఏపీ ముందుంది. 7 నుంచి 9 వేల మెగావాట్లపై చిలుకు విద్యుత్ ఉత్పత్తి చేశాం. కానీ జగన్ వచ్చాక కక్ష సాధింపులతో పీపీఏలు రద్దు చేశారు. ఒప్పందం చేసుకున్న విద్యుత్‌ను వాడకపోవడంతో రూ.9 వేలకోట్లు ఆ సంస్థలకు అప్పనంగా చెల్లించాల్సి వచ్చింది. ఆ భారమంతా ప్రజలపైనే పడింది. కేంద్రం ఇచ్చే రాయితీ పథకాలను కూడా వినియోగించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటీపీఎస్‌కు బొగ్గు సరఫరా చేసి నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తిలో 70 శాతం వినియోగంలోకి తెచ్చాం. 90 శాతం మేర విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రయత్నం చేస్తాం. కృష్ణపట్నం, కడపలోని ప్లాంట్లను కూడా వినియోగంలోకి తెస్తాం. విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గించాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యం. గత ప్రభుత్వంలో 17 శాతం పైన ఉండే షార్ట్ టర్మ్ విద్యుత్ కొనుగోలును 6.8 శాతానికి తగ్గించాం. స్వాపింగ్ విధానం ద్వారా అవసరమైనప్పుడు మాత్రమే రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల నుంచి విద్యుత్ తీసుకుంటున్నాం. విద్యుత్ రంగంలో సీఎం చంద్రబాబుకు అపారమైన అనుభవం ఉంది. దేశంలో మొదటిసారి సంస్కరణలు తెచ్చిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని మంత్రి గొట్టిపాటి అన్నారు.

**20 లక్షల సోలార్ రూఫ్‌టాప్‌లు లక్ష్యం**

రాష్ట్రంలో పీఎం సూర్యఘర్ పథకం కింద 20 లక్షల సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు లక్ష్యాన్ని సీఎం చంద్రబాబు నిర్దేశించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాం. కేంద్రం ఇచ్చే రాయితీ కాకుండా బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల సబ్సిడీ ఇస్తుంది. పీఎం కుసుమ్ కింద 12 కేవీ లైన్స్ నుంచే 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను పగటి పూటే ఇస్తున్నాం. పెద్ద ఎత్తున సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నాం. 400 కేవీ, 200 కేవీ, 33/11కేవీ విద్యుత్ స్టేషన్లు నిర్మిస్తున్నాం. ప్రతి ఏటా 6 నుంచి 8 శాతం విద్యుత్ వినియోగం పెరుగుతోంది. దానికి అనుగుణంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉత్పత్తి, సరఫరా చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

**భవిష్యత్తు కోసం..**

రాష్ట్రంతో పాటు అమరావతి రాజధాని భవిష్యత్‌ను దృష్టిపెట్టుకుని సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. రాయలసీమలో విండ్, సోలార్ పవర్‌కు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. బ్యాటరీ స్టోరేజీకికూడా అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పగటిపూట విద్యుత్ ఉత్పత్తి చేసి బ్యాటరీల ద్వారా నిల్వ చేసి రాత్రిపూట పీక్ సమయాల్లో వినియోగించుకునే అవకాశం ఉంది. వీటి ఏర్పాటుకు సంబంధించి టెండర్లు కూడా పూర్తయ్యాయి. పీఎస్‌పీలకు ప్రకాశం జిల్లాలో టెండర్లు కూడా పిలిచాం. గత ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను ఆదాయ వనరుగా మార్చుకుందని మంత్రి విమర్శించారు.

**ఛార్జీల తగ్గింపుతో చిరువ్యాపారులకు మేలు**

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2021-22లో రూ.3 వేల కోట్లు, 2022-23లో రూ.6,073 కోట్లు, 2023-24లో ప్రొవిజనల్ కలెక్షన్ అంటూ రూ.9,300 కోట్లు భారం వేశారు. ప్రతి యూనిట్‌పై అదనంగా 40 పైసలు భారం వేశారు. మొత్తం మీద ఐదేళ్లలో ప్రజల నెత్తిన రూ.18 వేల కోట్లకు పైగా విద్యుత్ భారం మోపారు. ప్రస్తుతం ట్రూడౌన్ ద్వారా 13 పైసలు తగ్గించాం.

2019లో మేం దిగిపోయే నాటికి మిగులు విద్యుత్ ఉంచాం. కానీ జగన్ దిగిపోయే నాటికి విద్యుత్ వ్యవస్థను నాశనం చేశారు. విపరీతమైన భారాలు వేశారు. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నా రాజస్థాన్ నుంచి 9 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేశారు. ఇవన్నీ బిల్లుల రూపంలో ప్రజలపై భారం పడింది. విద్యుత్ కొనుగోళ్లపై ఇష్టానుసారంగా ఖర్చు చేశారు. గత ప్రభుత్వం విధించిన ట్రూ అప్ ఛార్జీలతో చిన్న పరిశ్రమలదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. ప్రతి 10 రోజులకు ఒకసారి సీఎం చంద్రబాబు విద్యుత్ శాఖపై సమీక్ష చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇంకా ఛార్జీల భారం తగ్గుతుంది. ఈ తగ్గింపు ప్రజలకు భారం లేకుండా చేయడంతో పాటు పరిశ్రమల రాకకు ఊతమిస్తుందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

# దక్షిణ కొరియాలో మంత్రుల బృందం

- సుస్థిర నగరాల అభివృద్ధికి అవసరమైన అంశాల పరిశీలన
- అక్కడి విధానాలపై మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డి అధ్యయనం
- నామి ఐలాండ్, చియాంగ్ గెచెవోన్ వాగు, హన్ నదిని పరిశీలించిన వైనం
- ఈడీబీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు పర్యటన



దక్షిణ కొరియా/సియోల్/అమరావతి (చైతన్యరథం): అమరావతితో పాటు రాష్ట్రంలో సుస్థిర నగరాల అభివృద్ధి, రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి సంస్థ(ఏపీఈడీబీ) ఆధ్వర్యంలో మంత్రులు, అధికారులు దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లారు...స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 11.40 గంటలకు ఆ దేశ రాజధాని సియోల్ చేరుకున్నారు...ఆ తర్వాత దక్షిణ కొరియాలోని నామీ ఐల్యాండ్ సీఈవో మిన్ క్యోంగ్ వూతో మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు భేటీ అయ్యారు. దక్షిణ కొరియాలో సహజ సిద్ధమైన, సాంస్కృతిక, సాంప్రదాయక పర్యాటక ప్రదేశంగా ఉన్న నామీ ఐలాండ్ ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. సియోల్‌లో ఉన్న అతి పెద్ద పర్యాటక ప్రాంతం ఇదే కావడం విశేషం. ఇక్కడ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లతో ఏడాది పొడవునా సంగీత ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటమే కాకుండా ఆర్థికంగానూ లాభదాయకంగా ఉంది. నామీ ద్వీపం అభివృద్ధి, పర్యాటకులను ఆకట్టుకునేందుకు తీసుకున్న చర్యలపై అక్కడి సీఈవోతో మంత్రి నారాయణ చర్చించారు. 4,60,000 చ.మీ.విస్తీర్ణంలో అందమైన చెట్లు, పూల మొక్కలతో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న నామీ ద్వీపంలో అనుసరిస్తున్న విధానాలను అమరావతిని బ్లూ - గ్రీన్ సిటీగా రూపుదిద్దడంలో పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి నారాయణ నిర్ణయించారు.

**తీవ్ర కాలుష్యం నుంచి...**

మధ్యాహ్నం భోజనం తర్వాత సియోల్ లోని చియాంగ్‌గేచెఒన్ వాగును మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. 30 ఏళ్ల క్రితం పూర్తిగా మురుగునీటితో తీవ్ర కాలుష్యకారకంగా ఉన్న చియాంగ్‌గేచెఒన్ వాగు ఆ తర్వాత అత్యంత పరిశుభ్రంగా మారిన విధానాన్ని తెలుసుకున్నారు. 2003-2005 మధ్యకాలంలో సియోల్ నగరంలో మెరుగైన వాతావరణం కల్పించడం కోసం "చియాంగ్‌గేచెఒన్" పునరుద్ధరణ ప్రాజెక్టును స్థానిక ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సియోల్ నగర వాతావరణాన్ని మెరుగుపరచడం కోసం చేసిన ప్రయత్నం ఫలించి నేడు అత్యంత ఆహ్లాదకరంగా చియాంగ్‌గేచెఒన్ వాగు పరిసర ప్రాంతాలు మారాయి.

ముఖ్యంగా గతంలో అత్యంత మురికిగా, కాలుష్య కారకంగా ఉండే చియాంగ్‌గేచెఒన్ వాగులోని నీరు.. పునరుద్ధరణ తర్వాత ఎంతో స్వచ్ఛంగా మారింది. గాలి నాణ్యత పెరగడం, శబ్ద కాలుష్యం తగ్గడం.. తద్వారా జీవవైవిధ్యం మెరుగుపడటం ఈ వాగు పునరుద్ధరణలో ప్రత్యేకత. ఏపీలో కాలుష్య కారకంగా మారిన నదులు, కాలువలు, వాగులు వంటి వాటిని పునరుద్ధరించే కోణంలో ఈ వాగును మంత్రులు, ఏపీ ప్రభుత్వ ఉన్నతాధికారులు ఎం.టీ.కృష్ణ బాబు, కన్నబాబు పరిశీలించారు.

**సియోల్ మధ్యలో హన్ నది**

సాయంత్రం హన్ నదిని మంత్రులు పరిశీలించారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్ నగరం మధ్యలో ప్రవహించే హన్ నది.. నదీ పరిసర ప్రాంతాలను మంత్రులు పరిశీలించారు. సియోల్ అభివృద్ధిలో అంతర్భాగంగా నిలుస్తూ, నగరవాసులకు ఆహ్లాదకర వాతావరణ కల్పిస్తూ.. పర్యాటకులను ఆకర్షిస్తుండటం హన్ నది ప్రత్యేకత. అమరావతి నిర్మాణంలో సైతం ఇటువంటి ఆహ్లాదకర వాతావరణం కల్పించే కోణంలో హన్ నది తీర ప్రాంతాలను మంత్రులు అధ్యయనం చేశారు. హన్ నది తరీంలో అనేక పార్కులు, వంతెనలు, సైకిల్ మార్గాలు వంటి నిర్మాణాలతో ఆధునిక రాజధానులకు సరికొత్త రూపంగా సియోల్ నిలుస్తోంది. కృష్ణానది తీరంలో రాజధాని అమరావతి నిర్మిస్తున్న క్రమంలో హన్ నది.. తరహాలో ఆధునిక రాజధాని నిర్మాణంలో కృష్ణ తీరంలో అభివృద్ధికి ఉన్న అవకాశాలపై మంత్రులు స్థానిక అధికారులతో చర్చించారు.

రాత్రికి సియోల్‌లో భారత రాయబార కార్యాలయం డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ నిషికాంత్ సింగ్, షాలిని సింగ్ దంపతుల ఆహ్వానం మేరకు స్థానిక శరవణ భవన్‌లో విందుకు మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు టి. కృష్ణ బాబు, కాటమనేని భాస్కర్, కన్నబాబు, తదితరులు హాజరయ్యారు.

చైతన్యరథం

# సమసమాజ స్ఫూర్తి ప్రదాత గుర్రం జాషువా

- జయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్
- ముగ్గురికి జాషువా పురస్కారాల ప్రదానం
- తెలుగుకవుల మహాసభల పోస్టర్ ఆవిష్కరణ
- కలాన్ని ఆయుధంగా మలచిన సంస్కర్త: తేజస్వి
- సామాజిక రుగ్మతలను రూపుమాపారు: గుమ్మడి



విజయవాడ (చైతన్యరథం): కలాన్ని ఆయుధంగా మలచుకుని సమాజంలోని రుగ్మతలను రూపుమాపిన వ్యక్తి మహాకవి గుర్రం జాషువా అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం ఎన్టీ ఆర్ జిల్లా విజయవాడ ఎన్టీఆర్ కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం కోసం కృషి చేస్తున్న కనకదుర్గ ప్రసాద్‌రావు, పాలపర్తి శ్రీధర్, మీసాల లక్ష్మణ్, పొట్లూరి హరికృష్ణ, కె.గురువమ్మలకు గుర్రం జాషువా 2025 పేరిట ఒక్కొక్కరికి రూ.50 వేల నగదు పురస్కారాలను ప్రదానం చేశారు. పద్మశ్రీ, పద్మభూషణ్‌ల కన్నా గుర్రం జాషువా అవార్డులు పొందడం గొప్పగా భావించాలన్నారు. అంతకుముందు సమావేశ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువా చిత్రమాలికను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జునరావు రచించిన విశ్వనరుడు పుస్తకాన్ని, కళారత్న పాలపర్తి శ్రీధర్ రచించిన ముక్తా మణి పద్యశతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా డిసెంబ ర్ 27, 28 తేదీల్లో జరిగే ప్రపంచ తెలుగు కవుల మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

### కలాన్ని ఆయుధంగా మార్చుకున్న కవి

సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ గొప్ప కవి గురించి ఈ తరానికి తెలియకపోవడం బాధాకరమన్నారు. కవిత్వం అంటే సమాజాన్ని మార్చే ఆయుధం అని నమ్మిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అన్నారు. సామా జిక రుగ్మతలను కలంతో రూపుమాపిన వ్యక్తి అని కొనియాడారు. గబ్బిలం అనే కవిత్వం ద్వారా కుల, మత విద్వేషాలను పారద్రోలిన మహోన్నత వ్యక్తి అన్నారు. విశ్వనరుడు అనే పుస్తకాన్ని ఆదర్శం గా తీసుకుని సాగుతున్న వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అని గుర్తుచేశారు. పేదరికం, మతబేధాలు తనను గొప్పకవిగా తీర్చిది ద్దాయన్న గుర్రం జాషువా మాటలను ప్రస్తావించారు. మంత్రి దుర్గే ష్ కవులు, కళాకారులకు గుర్తింపు తెచ్చేందుకు అహర్నిశలు పని చేస్తున్నారని కొనియాడారు.

### సామాజిక రుగ్మతలను రూపుమాపారు

నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లా డుతూ సామాన్యులకు సైతం అర్ధమయ్యే రీతిలో రచనలు చేసిన వ్యక్తి గుర్రం జాషువా అన్నారు. మంత్రి దుర్గేష్ కళాప్రేమికుడు అని పేర్కొన్నారు. జాషువాపై ఆలపించిన గీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పురస్కార గ్రహీతలు జాషువా కవిత్వాన్ని, సాహి త్య పాండిత్యాన్ని తమదైన శైలిలో వివరించారు. పశువుల కాపరి నుంచి ప్రపంచాధినేత వరకు పాడుకునే శైలిలో కవిత్వం రాసిన మహోన్నత మనిషి అని ప్రశంసించారు. కోట్లు సంపాదించిన కవులు లేరు..కోట్లాది హృదయాలు గెలిచిన కవులు కోకొల్లలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, డైరెక్టర్ రేగుళ్ల మల్లిఖార్జునరావు, ఎన్టీఆర్ కలెక్టర్ జి.లక్ష్మీశ, నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సాంస్కృతిక శాఖ అధికారులు సుమన్, శ్రీనివాస్, ప్రముఖ రంగ స్థల, సినీనటుడు మీసాల లక్ష్మణ్, నంది అవార్డు గ్రహీత కనక దుర్గాప్రసాద్‌రావు, కత్తి గురువమ్మ, శ్రీధర్, జానపద కళల అకాడమీ మాజీ చైర్మన్, సహస్ర కవితా సంకలనం చేసిన పొట్లూరి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నూతన పర్యాటక పాలసీపై మార్గదర్శకాలు

- పారదర్శకంగా అనుమతులు, ప్రోత్సాహకాలు
- ఇన్వెస్టర్లలో నమ్మకం కల్పించేలా నియమావళి

విజయవాడ(చైతన్యరథం): నూతన పర్యాటక విధానం 2024 –29 ద్వారా అందించే వివిధ ప్రయోజనాలు, ప్రోత్సాహకాలు సరైన వ్యక్తులకు సజావుగా, నిష్పక్షపాతంగా సకాలంలో అందేలా చూడటానికి ప్రభుత్వం కార్యాచరణ మార్గదర్శకాలను జారీ చేసిం దని పర్యాటక శాఖ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మార్గదర్శకాలు ఒక నియమావళిగా పనిచేస్తాయని తెలిపింది. ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు, ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ప్రభుత్వం ప్రయోజనాలను ఎలా ప్రాసెస్ చేస్తుంది, విడుదల చేస్తుంది తదితర అంశాలపై ఈ మార్గదర్శకాలు ఒక నియమా వళిగా పనిచేస్తాయని వివరించింది. ఈ మార్గదర్శకాలు ప్రభుత్వ విభాగాల నుంచి ప్రైవేట్ పర్యాటక సంస్థల వరకు అందరికీ పార దర్శకతను కల్పించడమే గాక ఆలస్యాన్ని తగ్గిస్తాయని స్పష్టం చేసింది.

ప్రధానంగా నూతన పర్యాటక విధానం ఎంతకాలం అమలులో ఉంటుంది, ఎవరు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు అనేది వివరించడం, దరఖాస్తులను పరిశీలించడం, ధృవీకరించడానికి ఎవరు బాధ్యత వహిస్తారో స్పష్టం చేయడం వంటి అంశాలు మార్గ దర్శకాల్లో పేర్కొన్నామని వెల్లడించింది.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను క్లెయిమ్ చేయడానికి దశల వారీ ప్రక్రియను అందించడం, ప్రోత్సా హకాలను ఆమోదించడానికి, విడుదల చేయడానికి సమయాను కూల ప్రక్రియను తెలపడం వంటి అంశాలు అందులో పేర్కొన్నా మని స్పష్టం చేసింది. యాజమాన్యాల తనిఖీ విధానం, ప్రోత్సా హకాల ఆమోదం కోసం కమిటీల ఏర్పాటు, మెరుగైన పనితీరు కోసం కీలక అధికారులు, కన్వీనర్లకు విధులను కేటాయించడం, అందుబాటులో ఉన్న అన్ని ప్రోత్సాహకాలు, వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో జాబితా చేయడం, పారదర్శక పద్ధతిలో నిధులను విడుదల చేయడానికి స్పష్టమైన ప్రక్రియను రూపొందించడం తదితర మార్గదర్శకాల్లో పొందుపరిచినట్లు పేర్కొంది.

ఈ మార్గ దర్శకాలు ప్రభుత్వ మద్దతు, అర్హత కలిగిన పర్యాటక సంస్థలకు ఏ ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా, సులభంగా అందేలా చూస్తా యని భావిస్తున్నట్లు పర్యాటక శాఖ తెలిపింది. ఇన్వెస్టర్లలో నమ్మ కాన్ని పెంపొందించడానికి, వృద్ధిని ప్రోత్సహించడానికి ప్రతి రూపాయి అభివృద్ధి కోసం సరైన రీతిలో వినియోగించబడుతుంద ని చెప్పేందుకు మార్గదర్శకాలు రూపొందించబడ్డాయని స్పష్టం చేసింది.

# విద్యతోనే కురుబల అభివృద్ధి

- సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతో మేలు
- అమరావతిలో భక్త కనకదాస విగ్రహం
- వచ్చే నెల 5న తిరుపతిలో విగ్రహావిష్కరణ
- బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మంగళగిరి (చైతన్యరథం): విద్యతోనే కురుబల అభివృద్ధి సాధ్య మని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఐక్యమత్యంతో కురుబలు మెలగాల్సిన అవసరముందన్నారు. అమరావతిలో భక్త కనకదాస విగ్రహ ఏర్పా టుకు కృషి చేస్తున్నామన్నారు. మంగళగిరిలో ఓ కన్వెన్షన్ సెంటర్ లో ఆదివారం నిర్వహించిన కురుబ, కురువ, కురుమ సామా జిక వర్గీయుల రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. కురుబ, కురుమ, కురువ సామాజిక వర్గీ యుంతా ఒక్కటేనని, వారంతా ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. విద్యతోనే పేదరికం దూరమవు తుందని, అన్ని రంగాల్లోనూ ఉన్నతి సాధ్యమవుతుందని తెలిపారు. కురుబ, కురుమ, కురువ పేద విద్యార్థులకు అండగా నిలుద్దామని, అందుకు తాను వ్యక్తిగతంగా ఎల్లవేళలా సాయమందిస్తానని తెలిపారు.

### అమరావతిలో కనకదాస విగ్రహం

అమరావతిలో భక్త కనకదాస కాంస్య విగ్రహం ఏర్పాటు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ఇదే విషయమై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. తిరుపతిలో భక్త కనకదాస పీఠం ఏర్పాటుపైనా సీఎం చంద్రబాబుతో చర్చించినట్లు తెలిపారు. వచ్చే నెల 5న తిరుపతిలో భక్త కనకదాస కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నామని, ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

### చంద్రబాబుతోనే కురుబలకు మేలు

సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతోనే కురుబలకు ఎంతో మేలు కలుగుతోందని తెలిపారు. కురుబల రాజకీయ, ఆర్థిక, సామాజిక ఉన్నతికి ఆయన ఎంతగానో వెన్నుదన్నుగా నిలుస్తు న్నారన్నారు. కురుబలకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ఎంపీలుగానూ, తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా సేవచేస్తు న్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కురుబలకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తానని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నిక ల్లో పోటీ చేసే కురుబలను గెలిపించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తిరుపతిలో వచ్చే నెల 5న జరిగే భక్త కనకదాస కాంస్య విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, వివిధ జిల్లాలకు చెందిన కురుబ, కురుమ, కురువ సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

# శ్రీలంక నుంచి కాకినాడ మత్స్యకారుల విడుదల

- స్వదేశానికి రప్పించడంలో ఏపీ ప్రభుత్వం చొరవ

ఢిల్లీ (చైతన్యరథం): శ్రీలంకలోని జాఫ్నా జైల్లో నిర్బంధంలో ఉన్న నలుగురు కాకినాడ జాలర్లు స్వదేశానికి తిరుగు పయనం అయ్యారు. అంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఏపీ భవన్ నుంచి జాలర్ల విడుదలకు తక్షణ చర్యలు చేపట్టడంతో ఈనెల 26న నలుగురు జాలర్లను శ్రీలంక కోస్ట్ గార్డ్ సిబ్బంది భారత్‌కు అప్పగించారు. అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ సమీపంలోని మండపం వద్ద శ్రీలంక కోస్ట్ గార్డు సిబ్బంది ఈ నలుగురిని భారత్ కోస్ట్ గార్డ్ కు అప్పగించారు. తమిళనాడు లోని మండపం నుంచి నౌకలో బయలుదేరిన నలుగురు మత్స్యకారులు ఈనెల 30న కాకినాడకు చేరుకోనున్నారు. ఈ ఏడాది ఆగస్టు 3 తేదీన కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులు కె. శ్రీను వెంకటేశ్వర్, కర్రి నోకరాజ్ బొర్రియా, చందా నాగేశ్వరరావు, బ్రహ్మానందంలు పడవ కొనుగోలు చేయడానికి నాగపట్నంకు బయలుదేరారు. తిరిగి ప్రయాణించే సమయంలో నావిగేషన్ లోపం కారణంగా శ్రీలంక జలాల్లోకి కొట్టుకుపోయి, జాఫ్నా తీరం సమీపంలోకి చేరుకున్నారు. వారిని శ్రీలంక నౌకాకాదళం అదుపులోకి తీసుకొని, జాఫ్నా పోలీసులకు అప్పగించింది. ఆగస్టు 4వ తేదీ నుంచి ఈ నలుగురు మత్స్యకారులు ఏడు వారాలకు పైగా జాఫ్నా జైలులో ఉన్నారు. 52 రోజులుగా జాఫ్నా జైల్లో నిర్బంధంలో ఉన్న నలుగురిని స్వదేశానికి తిరిగి రప్పించే అంశంపై ఢిల్లీ లోని ఏపీ భవన్ అధికారులు జాఫ్నాలోని భారత రాయబార కార్యాలయం ద్వారా నిరంతర సంప్రదింపులు చేశారు. ఢిల్లీ లోని కోస్ట్ గార్డ్ కార్యాలయం ద్వారా నలుగురు మత్స్యకారులను స్వదేశానికి రప్పించేలా ఏపీ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ మంతనాలు జరిపారు. ఈ మేరకు ఈ నెల 26 తేదీన శ్రీలంక అధికారులు నలుగురు మత్స్యకారులను భారత్‌కు అప్పగించారు. ఏపీ ప్రభుత్వం తక్షణం స్పందించి సంప్రదింపులు చేయకపోతే ఈ నలుగురు మరో ఆరు నెలల పాటు జాఫ్నా జైల్లో గడపాల్సి వచ్చేదని అధికారులు చెబుతున్నారు.




# అరకు కాఫీకి జాతీయ గౌరవం

- గిరిజన రైతుల శ్రమకు దక్కిన గుర్తింపు
- జీసీసీని అభినందించిన మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి (చైతన్యరథం): అరకు వ్యాలీ కాఫీకి జాతీయస్థాయిలో గౌరవం లభించడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మక బిజినెస్ లైన్ చేంజ్ మేకర్ అవార్డ్స్ – 2025 లో అరకు కాఫీ.. "చేంజ్ మేకర్ ఆఫ్ ది ఇయర్" పురస్కారం దక్కించుకోవడం గిరిజన సమాజం గర్వించదగ్గ విషయం అన్నారు. జీసీసీ ఆధ్వర్యంలో గిరిజన రైతుల కృషి ఫలితంగా అరకు కాఫీ ఈ స్థాయి గుర్తింపు పొందిందని మంత్రి అభినందించారు. అరకు కాఫీ కేవలం ఒక బ్రాండ్ మాత్రమే కాకుండా గిరిజన సమాజం ఆత్మగౌరవానికి, ఆర్థిక స్వావలంబనకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ అవార్డు దక్కడం ద్వారా గిరిజన రైతుల శ్రమ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, భవిష్యత్తులో అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. జీసీసీ చేస్తున్న కృషి గిరిజనుల అభివృద్ధికి కొత్త దారులను చూపిస్తోందని ఆయన అభినందనలు తెలిపారు. ఇలాంటి అవార్డులు ఆంధ్రప్రదేశ్ గిరిజనుల కృషికి న్యాయం చేస్తాయి. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ అవార్డులు రావాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు.

దుర్గమ్మ సన్నిధిలో

# మూలా నక్షత్రం రోజున రద్దీకి తగ్గట్లు భారీ ఏర్పాట్లు

- ఎంతమంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా చర్యలు
- ఉచితంగా పంపిణీకి రెండు లక్షల చిన్న లడ్డూలు సిద్ధం
- మంచినీటి బాటిళ్ళు, పాలు, బిస్కెట్లు సిద్ధంగా ఉంచిన అధికారులు
- ఏర్పాట్లపై అధికారులతో మంత్రుల బృందం సమీక్ష



విజయవాడ (చైతన్యరథం): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో కీలక ఘట్టమైన మూలానక్షత్రం రోజున సోమవారం భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించేందుకు చేసిన ఏర్పాట్లపై మంత్రుల బృందం ఆదివారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సమావేశమై సమీక్ష నిర్వహించింది. మూలా నక్షత్రం రోజున అమ్మవారి దర్శనానికి పెద్దఎత్తున తరలివచ్చే భక్తుల కోసం చేసిన ఏర్పాట్లపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, ఆలయ ఈవో వీకే శీనా నాయక్ చర్చించారు.

సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారి దర్శనానికి ఆదివారం రాత్రి 11 గంటల నుంచి భక్తులను క్యూలైన్లో దర్శనం కోసం పంపే ఏర్పాటు చేశామని గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందని హోల్డింగ్ ఏరియాలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు వెల్లడించారు. భక్తులు సహకరిస్తే అందరికీ అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**2 లక్షలకు పైగా భక్తుల అంచనా**

సోమవారం అమ్మవారిని 2 లక్షల పైచిలుకు భక్తులు దర్శనం చేసుకుంటారని అంచనా వేస్తున్నామని చెప్పారు. క్యూలైన్లు సజావుగా సాగేలా, అమ్మ దర్శన భాగ్యం త్వరితగతిన లభించేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. మంచినీటి బాటిళ్లతో పాటు పాలు, బిస్కెట్లు వంటి వాటిని అదనంగా సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఎంతమంది వచ్చినా కోరినన్ని లడ్డూలు అందించేందుకు ఏర్పాటు చేశామన్నారు. తాత్కాలిక మరుగుదొడ్ల సంఖ్యను పెంచామని, పారిశుద్ధ్య చర్యలకు అదనపు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రకాశం బ్యారేజ్‌కి వరద నీరు పోటెత్తుతున్న నేపథ్యంలో ఘాట్ల వద్ద తీసుకున్న ముందుజాగ్రత్త చర్యల పైనా చర్చించారు. జల్లు స్నానాలు చేసేందుకు భక్తులకు కల్పించిన సౌకర్యాలను వివరించారు. సోమవారం భక్తుల రద్దీ దృష్ట్యా చిన్న చిన్న ఆంక్షలు పెడుతున్నామని .. ఆర్జిత సేవలకు వచ్చే వారు నిర్ణీత గడువు లోగా చేరుకోవాలని ఆలయానికి సంబంధించిన వాహనాల్లోనే కొండపైకి వచ్చేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. అందరికీ అమ్మ దర్శన భాగ్యం కల్పించేందుకు అన్ని శాఖలతో కలిసి సమన్వయంతో ప్రణాళిక పనిచేస్తున్నామని చెప్పారు.

# ఫేక్ ప్రచారంపై ఉక్కుపాదం!

అధికారంమిస్తే ప్రజలకు, రాష్ట్రాభివృద్ధికి ఎలాంటి మేలు చేస్తామో ప్రచారం చేసుకుని ఓట్లగటం నైతిక బాధ్యత. కానీ పచ్చి అబద్ధాలను ప్రచారం చేసి.. అధికారాన్ని గుప్పిట పట్టాలనే జగత్ కిలాడీ రాజకీయాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు వైసీపీలు. సంక్షేమం, అభివృద్ధిలో అప్రతిహతంగా దూసుకుపోతున్న కూటమి ప్రభుత్వంపై అసత్యాలు, నకిలీ వార్తలే ఆయుధంగా సోషల్ మీడియా, సొంత మీడియా, కూలినాలి మీడియాలో బూటకపు కథనాలను విశృంఖలంగా జనంలోకి వదులుతున్నారు.. వ్యక్తిత్వ హననాలకు తెగబడుతున్నారు. విష సంస్కృతికి పాల్పడుతున్న సంస్థలను జవాబుదారీ చేయకపోతే.. రాజకీయుల స్వార్థానికి భారత ప్రజాస్వామ్యం బలిపీఠమెక్కనున్నది. ప్రభుత్వంపై, పాలకులపై నిర్మాణాత్మకంగా విమర్శలు చేస్తే తప్పులేదు. కానీ కావాలని అబద్ధాలతో, ప్రభుత్వంపై ద్వేషంతో వికృత పోస్టులుపెడుతూ కువిమర్శలకు తెగబడుతున్న వారిని ఉపేక్షించడం ఏమాత్రం క్షేమకరం కాదు. ప్రభుత్వంపై, కూటమి నేతలపైన సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చెయ్యడంలో వైసీపీ హద్దుమీరి ప్రవర్తిస్తోంది. తప్పుడు ప్రచారాలు, పోస్టులకు తెగబడేవారి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించక తప్పదు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం, పోస్టుల నివారణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించి.. చట్టం విధివిధానాల రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ మొన్నటి కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోవడం ఆహ్వానించతగ్గ పరిణామం. సామాజిక మాధ్యమాల్లో నకిలీ వార్తల కట్టడికి అనేక దేశాల్లో బలమైన చట్టాలున్నట్టే.. ఆంధ్రప్రదేశ్‌లోనూ తప్పుడు ప్రచారం, నకిలీ వార్తల కట్టడికి బలమైన చట్టం తెస్తే తప్ప, విష సంస్కృతిని నియంత్రించడం సాధ్యం కాదు. తప్పుడు వ్యవహారాలతో ప్రభుత్వానికి నష్టం వాటిల్లక మునుపే.. కూటమి సర్కారు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సమాజ హితాన్ని విస్మరించి.. దేశం మొత్తానికి జాడ్యంగా మారిన సోషల్ మీడియా.. తెలుగు రాష్ట్రాల్లో మరింత ప్రమాదకర శక్తిగా వేళ్లూనుతోంది. అది మరింత బలపడకముందే కూకటి వేళ్లతో పెకిలించకుంటే స్వార్ధ రాజకీయ శక్తుల చేతికి ప్రమాదకర ఆయుధం దొరికినట్టే. ఇప్పటికే 'ఫేక్'రాయుళ్ల వ్యవహారంతో ఏపీలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. బూటకపు కథనాలు, నకిలీ వార్తల నియంత్రణకు ప్రస్తుత నియమ నిబంధనలు నిష్ప్రయోజనంగా మారాయి. ఈ పరిస్థితుల్లో 'ఫేక్'ను చట్టబద్ధంగా అడ్డుకుని.. తప్పుడు ప్రచారాలకు పాల్పడేవాళ్లకు విధించే శిక్షల తీవ్రతను పెంచాలని ఆ మధ్య పార్లమెంటరీ స్థాయీసంఘం సైతం అభిప్రాయపడింది. ప్రజాభిప్రాయాన్ని తమకనుకూలంగా మార్చుకోవడానికి తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి వ్యాప్తిచేస్తోన్న వైసీపీ మూకను ఉపేక్షించకుండా శిక్షించి తీరాలి. రాష్ట్రంలో నకిలీ వార్తల కార్ఖానాగా వైసీపీ వర్ధిల్లుతోందన్నది జగమెరిగిన సత్యం. అనేక దేశాల ప్రజలతో పోలిస్తే– వాస్తవాలకూ నకిలీకి మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడంలో సగటు భారతీయుల సామర్థ్యం పరిమితమని ఐపీఎస్ వోఎస్ గ్రూప్ అధ్యయన సారాంశం. నిజానిజాలతో నిమిత్తం లేకుండా.. కట్టు కథనాలు, అసత్యాల ప్రామాణికతను నిర్ధారించుకోకుండా.. నమ్మే ప్రజలు భారత్‌లోనే ఎక్కువమంది అన్నది ఆ నివేదిక చెప్తోంది. అంతేకాదు.. దేశంలో సోషల్ మీడియా వినియోగదారుల్లో 85 శాతం సామాజిక మాధ్యమాల్లో వచ్చేవన్నీ నిజాలేనని గుడ్డిగా నమ్మేవారే ఉన్నారనీ మరో సర్వే నిగ్గుతేల్చింది. ఉన్నత విద్యావంతులు సైతం తప్పుడు సమాచార వలలో పడుతున్నారన్నది కాదనిలేని సత్యం. ఈ బలహీనతనే వైసీపీ తన అస్త్రంగా మలచుకుని.. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే ప్రయత్నానికి ఒడిగడుతోంది. సామాజిక మాధ్యమాలలో నకిలీ వార్తల నియంత్రణకు కూటమి ప్రభుత్వం వేగంగా చట్టాన్ని రూపొందించి.. కఠిన చర్యలు తీసుకోవాల్సిన తరుణమిది!

ఫేక్ ప్రచారాలకు వైసీపీ కేరాఫ్‌గా మారిందనడానికి లెక్కలేనన్ని ఘట్టాలే నిదర్శనం. ప్రజలను ప్రభావితం చేసే అంశాలపై తప్పుడు ప్రచారమే లక్ష్యంగా వైసీపీ సోషల్ మీడియా రెచ్చిపోతోంది. కుప్పానికి కృష్ణా జలాలు తీసుకురావడాన్ని ఓర్వలేని జగన్ ముఠా.. నీళ్లే రావడం లేదంటూ సోషల్ మీడియాలో ప్రచారం సాగించారు. యూరియాపైనా తప్పుడు ప్రచారాలతో రైతులలో గాబరా రేకెత్తించి.. తప్పుడు ప్రచారంతో ప్రభుత్వంపై బురద చల్లాలనుకున్నారు. యూరియా కొరత, పరిశ్రమలకు భూకేటాయింపులు, పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక.. ఇలా ప్రతీ అంశంపైనా కూటమి ప్రభుత్వంపై జగన్ ముఠా అలవోకగా అబద్ధాలను ప్రచారం చేస్తోంది. ప్రభుత్వం ఎలాంటి అవాంతరాలు లేకుండా విద్యుత్తు సరఫరా చేస్తున్నా.. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్తు కోతలు అమలవుతున్నాయంటూ దుష్ప్రచారానికి దిగింది. కరెంట్ కోతలు లేకున్నా.. వైసీపీ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ఐడీలు సృష్టించి రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలు అమలవుతున్నాయని, జనం అల్లాడుతున్నారంటూ బురదజల్లే పోస్టులకు తెగబడింది. ఒక మోస్తరు వర్షం ఎక్కడ పడినా.. రాజధాని అమరావతి మునిగిందంటూ తప్పుడు ప్రచారాలు సాగిస్తోంది. పులివెందుల జెడ్పీటీసీ ఉపఎన్నికల సమయంలో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల వీడియోలను తీసుకొచ్చి రిగ్గింగ్ చేశారని, దివ్యాంగుల పింఛన్లలో అర్హులను తొలగిస్తున్నారని, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ పథకాల విషయంలోనూ ప్రజలను రెచ్చగొట్టే తప్పుడు ప్రచారాలకు తెగబడుతోంది.

సోషల్ మీడియా నకిలీ వార్తలు విశృంఖలం కాకముందే.. విష సంస్కృతికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు చట్టాన్ని తీసుకురావాల్సిన అనివార్య సమయమిది. ఈమధ్యే.. తప్పుడు ప్రచారాలను కట్టడి చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. వ్యక్తిత్వహననం, ప్రభుత్వంపై ఇష్టానుసారం దుష్ప్రచారం చెయ్యడంవంటి అంశాలను క్షమించాల్సిన అవసరం లేదనీ చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం సోషల్ మీడియా నియంత్రణకు చట్టం అవసరమన్నారు. కోడ్ ఆఫ్ కాండక్ట్ లేదా చట్టరూపంలో చర్య తీసుకోవాలని పవన్ సూచించారు. తెలంగాణలోనూ సోషల్ మీడియాలో నకిలీ వార్తలపై నిఘా పెంచేందుకు, ఫేక్ న్యూస్ నియంత్రణకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పలు శక్తివంతమైన టూల్స్ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆరంభంలో సోషల్ మీడియా వాడకంలోకి వచ్చినప్పుడు సమాచారవ్యాప్తికి, మార్పిడికి పెద్దఎత్తున దోహదపడింది. రాజకీయ పార్టీలు తమ పార్టీల కార్యకలాపాల ప్రచారం కోసం, సమాచార వ్యాప్తికి ఉపయోగించుకున్నాయి. దీంతో సోషల్ మీడియాకి ప్రాధాన్యత పెరిగింది. తర్వాత పార్టీల అనుకూల ప్రచారానికి మాత్రమే వినియోగించేవారు. కానీ జగన్మోహన్‌రెడ్డివంటి స్వార్ధ రాజకీయ శక్తి రాజకీయ రంగప్రవేశం చేశాక.. నకిలీ వార్తలు, అబద్ధాలతో ప్రజల మెదళ్లను కలుషితం చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలపై విషప్రచారం చేయించడం కోసం వందలు, వేలమందిని నియమించుకొని భారీ మొత్తాలలో జీతాలు చెల్లిస్తూ విష ప్రచారం చేస్తూ మొత్తం సమాజాన్ని కలుషితం చేస్తున్నారు. తప్పుడు ప్రచారం, నకిలీ వార్తల కట్టడికి బలమైన చట్టం తెస్తే తప్ప.. దీనికి అడ్డుకట్టపడదు. తప్పుడు ప్రచారంతో ప్రభుత్వానికి నష్టం కలుగకముందే కూటమి ప్రభుత్వం బలమైన చర్యలు తీసుకోవాలి!

- నీరుకొండ ప్రసాద్

# అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీలో ఎమ్మెల్యే కొణతాల**

అనకాపల్లి, (చైతన్యరథం): విద్యార్థులందరూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. పరీక్షల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ఆదివారం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సంఘంలోని ఆనాటి పెద్దలు ఏఎంఏఎల్ కళాశాలతో పాటు ప్రసూతి వైద్యశాలను నిర్మించారని గుర్తు చేశారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు ప్రణాళికతో చదవాలని సూచించారు. గౌరీ సంఘం ఆధ్వర్యంలో అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొణతాల లక్ష్మీనారాయణ, కర్రి సన్యాసి నాయుడు, రామ సత్యనారాయణ పాల్గొన్నారు.



# మలేషియా దేశ లో చెక్క భజనకు ఆదరణ

పలాస, (చైతన్యరథం): మలేషియాలో నివసిస్తున్న తెలుగువారికి చెక్కభజన, కోలాటం తదితర జానపద కళల్లో శిక్షణ ఇచ్చే అవకాశం ఉత్తరాంధ్ర కళాకారులకు రావడం గొప్ప విషయమని పలాస మండలం రంగోయిలోని గిడుగు రామమూర్తి తెలుగుభాష జానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు పేర్కొన్నారు. కళాపీఠం సభ్యులైన తవిటి నాయుడు, సాయికుమార్ మలేషియాలో నెల రోజులపాటు జానపద కళల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. చాలా ఏళ్ల కిందట బతుకుతెరువు కోసం అక్కడి వలస వెళ్లిన ఉత్తరాంధ్ర ప్రజలు ఇప్పటికీ తెలుగు భాషను, చెక్కభజన, కోలాటం, బుర్రకథలు, సేవా, గరిడి, గొబ్బిపాటలు తదితర జానపదాలను కాపాడుతున్నారన్నారు.





# సీఎం చంద్రబాబు పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**పరిశీలించిన విజయనగరం కలెక్టర్ రాం సుందర్**

విజయనగరం, (చైతన్యరథం): వచ్చేనెల ఒకటవ తేదీన సీఎం చంద్రబాబు గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి పరిశీలించారు. హెలీపాడ్ స్థలాన్ని, మ్యాప్లను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఎస్. సేదు మాధవన్, అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. యుద్ధ ప్రాతిపదికన చెత్తను తొలగించాలని, కాలువలను శుభ్రం చేయాలని, రోడ్లకు మరమ్మతు చేయాలని, పక్కనున్న గోతులను పూడ్చించాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ సభ ప్రాంతాన్ని కలెక్టర్ సందర్శించారు. వేదిక ఏర్పాట్లపై చర్చించారు. వర్షాలు పడినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్ కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన వెంట ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, ఆర్ అండ్ బీ ఎస్ఈ కాంతిమతి, తదితరులు పాల్గొన్నారు. దత్తిరాజేరు మండలంలో వచ్చే నెల సామాజిక పింఛన్ల పంపిణీని సీఎం ప్రారంభిస్తారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సేధుమాధవన్, ఇతర రెవెన్యూ అధికారులు శనివారం ఆ మండలానికి వెళ్లి పలుచోట్ల స్థలాలు పరిశీలించారు. దత్తి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు సమీపంలోని మూడు స్థలాలను తెదేపా కన్వీనరు, మాజీ కన్వీనర్లు చంద్రశేఖర్, సత్తిబాబు.. జేసీకి చూపించారు. -అనువుగా లేనందున అదే నియోజకవర్గంలోని ఇతర మండలాలను సైతం పరిశీలించాలని. - నిర్ణయించారు. ముఖ్యమంత్రి పర్యటనను ఆదివారం ఖరారు చేయనున్నారు. కలెక్టర్ రాంసుందర్రెడ్డి, ఎస్పీ దామోదర్, మంత్రి శ్రీనివాసరావుతో చర్చించిన తర్వాత హెలిప్యాడ్ సహా ఇతర ఏర్పాట్లు ముమ్మరం చేయనున్నారు.

# ముందు చూపుతోనే జీఎస్టీ 2.0కి ముఖ్యమంత్రి చంద్రబాబు మద్దతు

**మాజీ ప్రత్తిపాటి పుల్లారావు వెల్లడి**

గుంటూరు, (చైతన్యరథం): జీఎస్టీ శ్లాబుల తగ్గింపు నిర్ణయంలో ప్రధాని మోదీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు విలువైన సలహాలు..సూచనలు అందించారని మాజీమంత్రి ప్రత్తిపాటి వెల్లడించారు. లి పట్టణంలో నిర్వహించిన 'జీఎస్టీ ఉత్సవ్'లో మాజీమంత్రి ప్రత్తిపాటి పాల్గొన్నారు. 2047 నాటికి రాష్ట్రప్రభుత్వం పెట్టుకున్న నిర్దేశిత లక్ష్యాల సాధనకు నూతన జీఎస్టీ సంస్కరణలు, ముఖ్యమంత్రి ప్రజల కోసం అమలుచేస్తున్న సూపర్ -6 పథకాలు శక్తివంతంగా పనిచేస్తాయన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన, వ్యాపారులు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. జీఎస్టీ విప్లవాత్మక సంస్కరణల్ని చంద్రబాబు ముందే ఊహించారన్నారు. రాష్ట్ర ఆదాయం కంటే దేశ ఆర్థికప్రగతి.. రాష్ట్రంలోని ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చే జీఎస్టీ 2.0ను ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తున్నారన్నారు. దానిలో భాగంగా ప్రజల అవగాహన కోసం 'సూపర్ జీఎస్టీ' పేరుతో ప్రభుత్వం ప్రత్యే కార్యక్రమాలు నిర్వహిస్తోందని ప్రత్తిపాటి తెలిపారు. జీఎస్టీ శ్లాబుల తగ్గింపు నిర్ణయంలో ప్రధాని మోదీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు విలువైన సలహాలు..సూచనలు అందించారని, ఈ విప్లవాత్మక సంస్కరణల్ని ముందే ఊహించారని ప్రత్తిపాటి తెలిపారు. ప్రధాని మోదీ నిర్ణయం వల్ల సామాన్యుల కొనుగోలు శక్తి పెరగడంతో పాటు పండుగల వేళ ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. నిత్యావసరాలతో పాటు, గృహోపకరణాలు, మెడిసిన్స్ పై ధరలు తగ్గడం ప్రజలకు మేలు చేస్తుందన్నారు. నాలుగు శ్లాబులను రెండు శ్లాబులకు కుదించడం.. కొత్త జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజలకు కలిగే లబ్ధిని కూటమిప్రభుత్వం స్వాగతిస్తోందన్నారు. జీఎస్టీ ఫలాలు ప్రజలు అనుభవిస్తున్నారు అనడానికి, రాష్ట్రంలో పెరిగిన వాహనాల కొనుగోళ్లే



నిదర్శనమన్నారు. భారత్ ఏ దేశానికి లొంగదని మోదీ ఇప్పటికే ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. భారత్‌ను శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడంలో ప్రధాని మోదీ విజయవంతమయ్యారన్నారు. ఏ దేశం ఒత్తిళ్లు, బెదిరింపులకు భారత్ లొంగదని ఇప్పటికే ప్రపంచానికి చాటిచెప్పారని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. దేశంలో 28 రాష్ట్రాలుండగా పెట్టుబడుదారులు, పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు చూడటానికి కారణం చంద్రబాబుకున్న ఇమేజ్.. బ్రాండ్ తో పాటు, ప్రభుత్వ సహకారం కూడా ప్రధాన కారణమని ప్రత్తిపాటి పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి స్వయంగా ప్రధాని మోదీ వచ్చే నెల 16న కర్నూలుకు రానున్నారని, ఆ రోజు రాష్ట్రస్థాయిలో నిర్వహించే ర్యాలీలో కూటమిపార్టీల శ్రేణులు భారీస్థాయిలో పాల్గొనాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దూరి వీరారెడ్డి, కొత్త కోటేశ్వరరావు, మురకొండ మల్లిబాబు, బేరింగ్ మౌలాలి, మున్సిపల్ కాన్సిలర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ విజేతలతో కోనసీమ కళకళ

## మంత్రి సుభాష్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన కొత్త టీచర్లు, ప్రత్యేకంగా అభినందించిన మంత్రి







రామచంద్రపురం, (చైతన్యరథం): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సహకారంతో డీఎస్సీలో ఉచిత శిక్షణ పొంది విజేతలై, టీచర్లుగా ఉద్యోగం పొందిన పలువురు ఉపాధ్యాయులు మంత్రి సుభాష్ ను ఆదివారం సాయంత్రం మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయులుగా నియమితులై న సంగతి తెలిసిందే. ఇటీవలే విజయవాడలో నియామక పత్రాలు అందుకున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా ఉచితంగా ఇప్పించిన డీఎస్సీ కోచింగ్ ను సద్వినియోగం చేసుకొని, కష్టపడి చదివి ఉద్యోగం సాధించామంటూ ఆనందం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేరుస్తూ డీఎస్సీ విజయవంతంగా పూర్తి చేసిందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, మంత్రి సుభాష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా నిరుద్యోగులు, నిరుపేదలు, మహిళల పట్ల మంత్రి సుభాష్ చూపిస్తున్న ఆదరణ, దయ, కరుణ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రస్తుతించారు. నూతన ఉద్యోగం ద్వారా సమాజానికి, విద్యా లోకానికి తమ వంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఉచిత డీఎస్సీ శిక్షణ ద్వారా జిల్లాలో 5,15,16,41,51,124,142,146,271 ర్యాంకులతో పాటు సుమారు 20 కి పైగా ర్యాంకు లు సాధించి విజయ దుందుభి మోగించారు. ఉద్యోగం పొందిన వారందరినీ మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏ ఏం సి చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్, చేతుల మీదుగా ప్రశంసా పత్రం, దుస్సాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నిపుణులు కునుకు సుబ్రమణ్యం, గరగ విజయలక్ష్మి(శిక్షణ సంస్థ డైరెక్టర్)ఎస్ కే పి పి చైర్మన్ సలాది నాయుడు మాస్టర్, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

# ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

## నిర్వాహకులను అభినందించిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్



కానూరు, (చైతన్యరథం): తుమ్మల ఆంజనేయులు ట్రస్ట్ ఆంధ్రా యూరాలజీ అండ్ గైనకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం మహాదేవపూర్ కాలనీ శ్రీధర్మా రెసిడెన్సి వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. కానూరు సమీప ప్రాంతాల ప్రజలు ఈ శిబిరంలో పెద్దసంఖ్యలో పాల్గొని వైద్య సేవలు పొందారు. యూరాలజీ, యూరో ఆంకాలజీ, ఆండ్రాలజీ, రోబోటిక్ సర్జన్ డాక్టర్ మనోజ్ తుమ్మల, గైనకాలజీ యూరో గైనకాలజీ, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ వర్షిణి రోగులను పరీక్షించారు. బీపీ, షుగర్, ప్రొస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్, మూత్ర ప్రవాహ పరీక్ష, పాప్ స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిర నిర్వహణకు డాక్టర్ ఎం. రంగారావు, బి మోహన్, కే రామకృష్ణ, జి రాధాకృష్ణ, టి అజయ్, కే నాగభూషణరావు, డి. సత్యనారాయణ, మురళి తదితరులు సహకరించారు. వారిని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అభినందించారు.

# అభివృద్ధి అంటేనే కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే బోడే



తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురు గ్రామంలో ఇంద్రకీలాద్రి నగర్, విఘ్నేశ్వర నగర్,ప్రధాన రోడ్డు, 1,2,3 రోడ్లకు కోటి 52 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ యనమలకుదురు గ్రామంలో 2014-19 సమయంలో పర్యటిస్తున్నపుడు, రోడ్లన్నీ పల్లంలో ఉండటం వల్ల ప్రతీ ఇంట్లోని వాడిన నీరు అంతా రోడ్డుపైకి వచ్చి చాలా దుర్భరమైన పరిస్థితిలో ఉండడం చూసి బాధపడ్డానని, అప్పుడే గట్టి సంకల్పాన్ని తీసుకుని, యనమలకుదురులో గృహసముదాయాల నిర్మాణదారులను పిలిపించి మాట్లాడి, పర్మిషన్స్ గురించి కాదు, మీరు కట్టిన ఏరియాలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి సహకారం కావాలని అడగగా, వారిచ్చిన సహకారం, నేను వ్యక్తిగతంగా కొంత నగదు మరియు నా దగ్గర ఉన్న నిర్మాణ సామగ్రి ఉపయోగించి 70 రోడ్లను 2 మీటర్ల ఎత్తు వచ్చేలా సీసీ రోడ్ల నిర్మాణానికి అనుకూలంగా అభివృద్ధి చేసి, ప్రభుత్వ నిధులతో సిమెంటు రోడ్లు వేసి, ప్రజలకు అందించామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ గారు స్పష్టం చేశారు.నిర్మాణదారుల సహకారంతో 70 రోడ్లు అభివృద్ధి చేసి చూపిస్తే, ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తప్పుడు ఆరోపణలతో బోడే ప్రసాద్, తప్పు చేశాడని, డబ్బులు దోచుకున్నాడని వైకాపా పార్టీ వాళ్ళు ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేసిన ప్రజలందరూ నా వెంట ఉండి, అత్యధిక మెజారిటీ గెలిపించారని అన్నారు. 2019 అధికారంలోకి వచ్చిన వైకాపా అభివృద్ధి అనేది కనీసం చేయకపోగా రోడ్లన్నీ పాడయ్యి ప్రజలందరూ నడవడానికి ఇబ్బంది పడ్డారని, 2024 నుండి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో యనమలకుదురు గ్రామంలో 3కోట్ల నిధులతో పూర్తి కావస్తున్న నిర్మాణం,. మరియు ఇప్పుడు శంకుస్థాపన చేసిన కోటి 52 లక్షల నిధులు కలిపి 4.50కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామని చెప్పడానికి సంతోషంగా ఉందనీ, తాడిగడప మున్సిపాలిటీలో ఇప్పటి వరకు 35 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేయగలిగానని, ఇంకా అనేక పనులకు నిధుల మంజూరు కొరకు దరఖాస్తు చేసి సిద్ధంగా ఉన్నాయని త్వరలోనే కోట్ల రూపాయలను తీసుకువచ్చి అభివృద్ధిలో పరుగులు పెడతామని ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేయడంలో సంకల్పం కలిగి ఉన్నానని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

## స్వీయ నియంత్రణ పాటించాలి: భక్తులకు కేశినేని శివనాథ్ పిలుపు



విజయవాడ, (చైతన్యరథం): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం శ్రీ మహాచండీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. బెజవాడ కనకదుర్గను దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇవాళ ఇప్పటి వరకు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. మరోవైపు సోమవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని అమ్మవారు సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

### భక్తులు స్వీయ నియంత్రణ పాటించాలి: కేశినేని శివనాథ్

మూలా నక్షత్రం రోజు భక్తులు స్వీయ నియంత్రణ పాటించాలని ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సోమవారం ఇంద్రకీలాద్రిపై ఎలాంటి పాసులకు అనుమతి లేదని చెప్పారు. అమ్మవారికి సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించబోతున్నట్లు తెలిపారు.







# కిటకిటలాడుతున్న ఇంద్రకీలాద్రి



## వాహనాల దారిమళ్లింపునకు పకడ్బందీ చర్యలు




విజయవాడ, (చైతన్యరథం): ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 29న (సోమవారం) మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని అమ్మవారు సరస్వతి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కొన్ని ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాలను గుర్తించి.. రద్దీని క్రమబద్ధీకరించేలా ఏర్పాట్లు చేశారు. పున్నమి ఘాట్ ఎంట్రన్స్, తాడేపల్లి చెక్పోస్టు, ఆర్టీసీ ఇన్గేట్, కనకదుర్గ ఫ్లైఓవర్, గద్ద బొమ్మ సెంటర్ మీదుగా అమ్మవారి గుడివైపు ద్విచక్రవాహనాలను అనుమతించరు. ఈ నిబంధనలు ఆదివారం రాత్రి 7.30 నుంచి మంగళవారం ఉదయం 10గంటల వరకు అమల్లో ఉంటాయి. తాడేపల్లి చెక్పోస్టు నుంచి బ్యారేజీ వైపు వచ్చే వాహనానాలను కనదుర్గ వారధి వైపు మళ్లిస్తారు. గుంటూరు, వారధి వైపు నుంచి భవానీపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం వైపు వెళ్లాల్సిన వాహనదారులు కనకదుర్గ ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. పీసీఆర్ వైపు నుంచి భవాని పురం గొల్లపూడి, ఇబ్రహీంపట్నం వైపు వెళ్లాల్సిన వాహనాలను గద్ద బొమ్మ సెంటర్ మీదుగా, కాళేశ్వరం మార్కెట్, పంజా సెంటర్, విజి చౌక్, చిట్టినగర్, సొరంగం మీదుగా మళ్లిస్తారు. పున్నమి ఘాట్, కుమ్మరిపాలెం వైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలను గుప్తా సెంటర్ మీదుగా సితార జంక్షన్, సొరంగం, చిట్టినగర్, ఎర్రకట్ట, బీఆర్ ఎస్ వైపుగా మళ్లించడమైంది. ఇబ్రహీంపట్నం, గొల్లపూడి వైపు నుంచి నగరంలోకి ప్రవేశించే వాహనాలను గొల్లపూడి వై జంక్షన్ మీదుగా సితార జంక్షన్, సీవీఆర్ ఫ్లై ఓవర్, పైపుల్ రోడ్డు, సింగ్ నగర్ వైపు మళ్లిస్తారు. విజయవాడ సిటీ నుంచి, ఆర్టీసీ ఇన్ గేట్ వైపు నుంచి రాష్ట్ర సచివాలయానికి, హైకోర్టు వైపు వెళ్లే వాహనాలు కనకదుర్గ ఫ్లైఓవర్ మీదుగా భవానిపురం, గొల్లపూడి, వెస్ట్ బైపాస్ మీదుగా, లేదంటే కనకదుర్గ వారధి, తాడేపల్లి మీదుగా మళ్లిస్తారు. హైదరాబాద్, ఇబ్రహీంపట్నం. గొల్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలకు బొబ్బూరి గ్రౌండ్, పున్నమి ఘాట్, భవానిపురం లారీ స్టాండ్, తితిదే ఖాళీ స్థలంలో పార్కింగ్ కేటాయించారు. గద్ద బొమ్మ వరకు వచ్చే కార్లు, ద్విచక్రవాహనాలకు కాళేశ్వరం మార్కెట్ సెల్లార్, గాంధీ మున్సిపల్ హైస్కూల్ రోడ్డులో పార్కింగ్ కేటాయించారు. ప్రజలు, వాహనదారులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి

తోట్లవల్లూరు, (చైతన్యరథం): పరకామణి అంశంపై శాసనమండలిలో చర్చించామని, రానున్న రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో ఆదివారం ఆయన పర్యటించారు. శివాలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సనాతన ధర్మం పాటిస్తూ ఆలయాలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తిరుమలలోని పరకామణి విషయంలో శాసనసభ స్పీకర్ సమయం ఇవ్వక పోవడం వల్ల మాట్లాడలేకపోయామన్నారు. అందుకే శాసనమండలిలో వివరణ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో 361 దేవాలయాల పునర్నిర్మాణానికి రూ.500 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వివరించారు.





మంత్రి సవితకు స్వాగతం పలుకుతున్న నాయకులు, సభకు హాజరైన సభ్యులు



# లారీ ఓనర్స్ ఫౌండేషన్ ఔదార్యం

## పేద విద్యార్థులకు, వితంతువులకు , రోగులకు రూ. 30 లక్షల ఆర్థిక సాయం

విజయవాడ (కొత్త ఆసుపత్రి): ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 191 మంది పేద విద్యార్థులతో పాటు 36 మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, రోగులకు రూ.33 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆదివారం విజయవాడలోని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు రావి గోపాలరావు అధ్యక్షతన 2025-26 సంవత్సరానికి మొత్తం 227 మందికి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం. అనిల్ కుమార్, విజయవాడ ఆదాయపన్ను విభాగం ఇన్ ప్రిన్సిపల్ కమిషనర్ బి. సునీత అందజేశారు. ఫౌండేషన్ సామాజిక సేవకు పునరంకితం అయిందంటూ వారు అభినందించారు. సభను ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వై.వి. ఈశ్వరరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ సంఘం పాలకవర్గం, కార్యవర్గ సభ్యులు, ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ స్టోర్స్ డైరెక్టర్లు, ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రకాశం బ్యారేజీకి వరద పోటు

## రెండో ప్రమాద హెచ్చరిక జారీ

విజయవాడ, (చైతన్యరథం): ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇక్కడ ఇన్ఫ్లో, ఔట్ఫ్లో 6.05 లక్షల క్యూసెక్కులుగా ఉంది.. దీంతో 69 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. లంక గ్రామాల ప్రజలను జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. ప్రకాశం బ్యారేజీ నంచి కృష్ణా నదికి భారీగా వరద వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కృష్ణా నదికి వరదల దృష్ట్యా మండలాల్లో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేశారు.



# గరుడ వాహనంపై గోవిందుడి చిద్విలాస విహారం

తిరుమల, (చైతన్యరథం): సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు ఆదివారం శ్రీవేంకటేశ్వర స్వామివారు తనకు ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమల దివ్యక్షేత్రంలో సాయంత్రం 6.30కి గరుడ వాహనసేవ మొదలైంది. భక్తుల గోవింద నామస్మరణతో తిరుగిరులు మార్మోగాయి. మాడవీధుల గ్యాలరీల్లోకి దాదాపు రెండు లక్షల మందికి పైగా భక్తులు చేరుకున్నారు. నందకం, రామ్భగీచా, లేపాక్షి ప్రాంతాల్లో భక్తులు బారులు తీరారు. తిరుమలలో వాహనాల పార్కింగ్ ప్రాంతాలు పూర్తి నిండిపోయాయి. శ్రీవారి మూలవిరాట్టుకు అలంకరించే లక్ష్మీహారం, మకరకంఠి ఆభరణాలను ఏడాదిలో ఒక్కసారి.. అదీ గరుడసేవ రోజు మాత్రమే ఉత్సవమూర్తి అయిన శ్రీమలయప్పస్వామికి అలంకరిస్తారు. ఉదయం స్వామివారు సర్వాలంకార భూషితుడై మోహినీ అవతారంలో శృంగార రసాది దేవతగా భక్తులను తన్మయపరిచారు. పక్కనే మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై అభయమిచ్చారు.

తల్లిని బానిసత్వం నుంచి విడుదలచేసేందుకు వైనతేయుడు అమృతభాండాన్ని తీసుకువెళ్తాడు. మాతృమూర్తిపై అచంచల విశ్వాసాన్ని ప్రదర్శించిన గరుత్మంతుడిని శ్రీమహావిష్ణువు తన వాహనంగా చేసుకున్నాడు. అందుకనే ఈ సేవను చూసేందుకు వేలాదిమంది భక్తులు తిరుమలకు. తరలివస్తారు. అన్నమయ్య 'ఇటు గరుడుని నీ వెక్కినను, పటపట దిక్కులు బగ్గన బగిలె..' అంటూ ఆ కలియుగ వైకుంఠనాథుని గరుడసేవ వైభవాన్ని పేర్కొన్నాడు. వాహన సేవల్లో తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు









పల్నాడు జిల్లా నకరికల్లు మండలం నరసింగపాడు గ్రామంలో గంగా అన్నపూర్ణాదేవి అమ్మవారిని రూ.6 కోట్ల కరెన్సీ నోట్లతో సుందరంగా అలంకరించారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన అన్నపూర్ణాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు.

## మోహినీ అలంకారంలో మలయప్ప స్వామి సాక్షాత్కారం

తిరుమల, (చైతన్యరథం): తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన ఆదివారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు మోహినీ రూపంలో సర్వాలంకార భూషితుడై దర్శనమిచ్చారు. పక్కనే మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై అభయమిచ్చారు. ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు.

### మోహినీ అవతారం, మాయా మోహ నాశనం

ఈ అలంకారం ద్వారా జగత్తు అంతా మాయామోహానికి లొంగివుందని, అదంతా తన లీలా విలాసమేనని, తన భక్తులు కానివారు ఈ జగన్మాయలోలులు కాక తప్పదని స్వామివారు ఈ రూపంలో చాటి చెబుతున్నారు.

వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు, ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### గరుడ వాహనం

సాయంత్రం 6:30 గంటలకు విశేషమైన గరుడవాహనంపై శ్రీమలయప్పస్వామివారు కటాక్షిస్తారు.

### గరుడ వాహనం సర్వపాప ప్రాయశ్చిత్తం

పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు.

అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగదధిష్టుతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు.

# అన్ని రంగాల్లోనూ ఏపీదే అగ్రస్థానం

జీఎస్టీ ఫలాలు ప్రజలకు అందాల్సిందే వచ్చే16 లోగా ఆక్వా సాగుకు రైతులు లైసెన్సులు పొందాలి వైసీపీ నేతల కలలు, ఊహలు ఫలించే ప్రసక్తే లేదు, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

పొదలకూరు, (చైతన్యరథం): సంక్షేమ పథకాలు అమలుతో పాటు పరిశ్రమలు, పెట్టుబడుల సాధనలో దేశంలోనే అగ్రగామిగా ఏపీ నిలుస్తుందని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరులో మీడియాతో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపుతో వచ్చే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూటమి నాయకులపై ఉందన్నారు. ప్రస్తుతం కొన్ని వస్తువులపై అసలు జీఎస్టీ లేకపోగా, కొన్నింటి 5, 18 శాతం శ్లాబులకు పరిమితం చేశారు ఫలితంగా అనేక రకాల వస్తువుల ధరలు తగ్గిపోతున్నాయన్నారు. 18 శాతం పన్ను కూడా ఏసీలు, టీవీలు, ఖరీదైన వాహనాలపైనే ఉంది పొగాకు, పాన్ మసాలా, లగ్జరీ కార్లపైన మాత్రమే 40 శాతం పన్ను విధించి, పాలు, గుడ్లు తదితర ఆహార పదార్థాలపై జీఎస్టీని తొలగించారన్నారు. జీఎస్టీ మార్పులు ప్రజలకు అనేక ప్రయోజనాలు కలిగించబోతున్నాయన్నారు. జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలకు అందేలా వ్యాపారులు సహకరించాలని పిలుపునిచ్చారు.

అమలుతీరును పర్యవేక్షించే బాధ్యత కూటమి నాయకులు, సామాన్య ప్రజలపైనా ఉంది ఎక్కడైనా వ్యాపారులు సహకరించకపోతే అధికారులతో పాటు మా దృష్టికి తీసుకురండిరాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక ప్రయోజనాలు కలిగిస్తోందన్నారు. వచ్చేనెల 4న ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు చొప్పున అందించబోతున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ ప్రయోజనాలు అందిస్తామన్నారు. చేపలు, రొయ్యలు రైతులు కచ్చితంగా ఆక్వా అథారిటీ వద్ద లైసెన్సులు పొందాలన్నారు. ఆ లైసెన్సు ఉంటేనే ప్రభుత్వ ప్రయోజనాలు, విద్యుత్ చార్జీల సబ్సిడీలు అందుతాయని గుర్తుంచుకోవాలన్నారు. వచ్చేనెల అక్టోబర్ 16వ తేదీ లోపు ఆక్వా సాగు చేస్తున్న రైతులందరూ లైసెన్సులు పొందాలని కోరారు. సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సంబంధిత మంత్రులకు అర్జీలు సమర్పించాం ప్రజల సమస్యలను తెలుసుకోవడంలో రాష్ట్రంలోనే సర్వేపల్లి నియోజకవర్గం ముందుంది.



త్వరలోనే టీపీ గూడూరు మండలంలోనూ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తాం ఇప్పటి వరకు 2600 గిరిజన కుటుంబాలకు ఆధార్ కార్డులు ఇప్పించామన్నారు. వారికి రేషన్ కార్డులతో పాటు ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు పొందేలా కషి చేస్తున్నామన్నారు. ప్రజల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడంలోనూ, పరిశ్రమలు, పెట్టుబడులు సాధించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ఇవన్నీ ఓర్చుకోలేక వైసీపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. వారి ఆశలు, ఊహలు నెరవేరే పరిస్థితి లేదు డీఎస్సీ ఉద్యోగాల నియామక పత్రాలు అందించే ప్రక్రియ పండగ వాతావరణంలో కొనసాగింది. సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన 43 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారికి అభినందనలు తెలిపారు.



# వంతెనల నిర్మాణాలకు భూమి పూజ

**కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి దంపతులు**

కడప, (చైతన్యరథం): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తెదేపా లక్ష్యమని కడప ఎమ్మెల్యే.మాధవి అన్నారు. కడప నగరంలో ప్రవహిస్తున్న బుగ్గ వంకపై రవీంద్ర నగర్, షామీరియా దర్గా వద్ద కొన్నేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు వంతెనలకు సంబంధించి ఇవాళ ఎమ్మెల్యే మాధవి భూమి పూజ చేశారు. సుమారు రూ.20 కోట్లతో రెండు వంతెనలను నిర్మిస్తున్నామని ఆమె చెప్పారు. గత వైకాపా ప్రభుత్వం ఈ రెండు వంతెనలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన సందర్భంలో స్థానికులు వంతెనలు కావాలని కోరారని ఆమె చెప్పారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ మనోజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆదోని మార్కెట్: ఆదోని పట్టణంలో వరద బాధితులకు తెదేపా మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఉచితంగా నిత్యావసర సరకుల కిట్లను పంపిణీ చేశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రాంజీలు చెరువు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలను జలమయం అయ్యాయి. దీంతో పలు కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ఒక్కో కిట్టు విలువ సుమారు రూ.500 కాగా.. వెయ్యి కుటుంబాలకు వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భూపాల్ చౌదరి, మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి, తిమ్మప్ప, కృష్ణ, జయరాం తదితరులు పాల్గొన్నారు.





# హంద్రీనీవాకు పోటెత్తుతున్న వరద

కర్నూలు, (చైతన్యరథం): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా కర్నూలు వద్ద హంద్రీ నది పోటెత్తింది. భారీ వర్షాలతో వాగులు, వంకలు, కాలువల ద్వారా వరద నీరు హంద్రీ నదికి వచ్చి చేరుతోంది. నదికి అనుకొని నగరంలో ఉన్న చెంచుకాలనీ, దేవనగర్, బుధవారపేటలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వరద కారణంగా రాకపోకలకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

# పేదల పాలిట పెన్నిధి సీం చంద్రబాబు

**8 మంది లబ్ధిదారులకు 4,90,220 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్**

జగ్గయ్యపేట,(చైతన్యరథం): పట్టణానికి చెందిన పలువురు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందిన తర్వాత, అధిక వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో, బాధిత కుటుంబాల తరపున ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి సిఫార్సు లేఖలు పంపారు. ఆ దరఖాస్తులను పరిశీలించిన ప్రభుత్వం, మొత్తం 8 మంది లబ్ధిదారులకు 4,90,220 రూపాయల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది.

ఈ చెక్కులను ఎమ్మెల్యే తాతయ్య ఆదివారం తన నివాసంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిజంగా అర్హులైన వారికి ఆర్థిక భరోసా అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. లబ్ధిదారులు తమ సమస్యలను గుర్తించి సహాయం అందజేసినందుకు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనేని రాధాకృష్ణ, గింజుపల్లి కృష్ణ, గద్దం రాంబాబు, బాల, గాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.





కానూరులోని మహదేవపురం వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

# కరూర్ తొక్కిసలాటకు కారణాలివే...

- 40కి చేరిన మృతుల సంఖ్య
- సీబీఐ దర్యాప్తు కోరుతూ కోర్టుకు టీవీకే
- ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన విజయ్
- విచారణ తర్వాత కఠిన చర్యలు: స్టాలిన్

కరూర్ సినీనటుడు, టీవీకే పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ ర్యాలీలో 10,000 మంది పాల్గొంటారనే అంచనాలతో పర్మిషన్ తీసుకున్నారు. ఈ విషయాన్ని తమిళనాడు డీజీపీ జి.వెంకట్రామన్ వెల్లడించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ దుర్ఘటనకు కారణాలను తెలిపారు. "విజయ్ పార్టీ నాయకులు కేవలం 10,000 మందితో ర్యాలీ నిర్వహించడానికి మాత్రమే అనుమతులు కోరారు. కానీ, ఆ సంఖ్యకు మించి అభిమానులు వస్తారని మేము అంచనా వేశాం. దీనికితోడు టీవీకే సోషల్ మీడియాలో విజయ్ వాస్తవంగా వచ్చిన సమయం కంటే.. చాలా ముందుగా మధ్యాహ్నం 3 గంటలకే వస్తారని ప్రకటించారు. కానీ రాత్రి 7.30కి వచ్చారు. దీంతో ఆ ప్రదేశంలో భారీగా అభిమానులు చేరుకుని ఎదురు చూశారు. అధికారులు ఈ కార్యక్ర మానికి 1.2లక్షల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారు. గతంలో అన్నాడీఎంకే ర్యాలీ అక్కడ జరిగింది. ఘటనా స్థలానికి వెంటనే 2,000 మంది సిబ్బందిని సీనియర్ పోలీసు అధికారులను పంపించాం. ఏక సభ్య కమిషన్ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది." అని డీజీపీ వెల్లడించారు.

**విజయ్ సహాయకులపై కేసు**

కరూర్లో తొక్కిసలాటకు సంబంధించి సినీ నటుడు విజయ్కు చెందిన ఇద్దరు సహాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్, జాయింట్ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్లై ఎఫ్ఎస్ఐఆర్ నమోదు చేశారు. ఈ విషయాన్ని లా అండ్ ఆర్డర్ ఏడీజీపీ ఎస్ డేవిడ్సన్ ధ్రువీకరించారు. ఈ ఘటనపై ప్రాథమిక దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

**ర్యాలీలో రాళ్ల దాడి అవాస్తవం**

విజయ్ నిర్వహించిన ర్యాలీలో రాళ్లు రువ్వడంతో పాటు పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నట్లు టీవీకే చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని అదనపు డీజీపీ డేవిడ్సన్ దేవాశీర్వతం పేర్కొన్నారు. పార్టీ నేతలపై, ప్రజలపై ఎటువంటి దాడి జరగలేదని వెల్లడించారు. విజయ్కు అభిమానులు ఎక్కువ ఉండడం వల్ల ఇటువంటి ఘటనలు జరగకూడదనే ఉద్దేశంతో ముందుగానే తాము ర్యాలీ వేదిక మార్పు గురించి పార్టీ నేతల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. అయినప్పటికీ తమ ఆదేశాలను ధిక్కరించి ఆ పార్టీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారన్నారు. ర్యాలీ ఆలస్యమవ్వడం వల్ల తర్వాత కార్యక్రమం జరగాల్సిన నామక్కల్ నుంచి కూడా అభిమానులు కరూరు వచ్చారని అన్నారు. అందువల్లే అక్కడ రద్దీ విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలను నియంత్రించడం కష్టంగా మారిందన్నారు. అనుమతించిన దానికంటే ఎక్కువ మంది కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు.





**విచారణ తర్వాత కఠిన చర్యలు: స్టాలిన్**

ఘటనపై విచారణ నిర్వహించి కమిషన్ నివేదిక తర్వాత కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం స్టాలిన్ తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శించారు.

**హైకోర్టుకు టీవీకే**

చెన్నై: కరూర్లో శనివారం నాడు నిర్వహించిన పార్టీ ర్యాలీలో తొక్కిసలాట జరిగి 40 మంది మృతిచెందిన ఘటనపై సీబీఐ లేదా సిట్ చేత దర్యాప్తు జరిపించాలని నటుడు, రాజకీయ నేత విజయ్ సారథ్యం లోని టీవీకే మద్రాసు హైకోర్టును కోరింది. టీవీకే న్యాయవాదుల విభాగం అధ్యక్షుడు ఎస్.అరి వాళగన్ సారథ్యంలోని కొందరు అడ్వకేట్లు ఆదివారం నాడు గ్రీన్వేస్ రోడ్డు లోని జస్టిస్ ఎం.దండపాణి నివాసానికి వెళ్లి ఈ విషయాన్ని ప్రస్తావించారు. ప్రత్యామ్నాయంగా కరూర్ విషాద ఘటనను సుమోటోగా స్వీకరించాలని కోరారు. మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ ముందు పిటిషన్ దాఖలు చేయాలని జడ్జి సూచించినట్లు టీవీకే పార్టీ కార్యకర్త నిర్మల్కుమార్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2.15 గంటలకు పిటిషన్పై విచారణ చేపడతామని వెల్లడించారు. మరోవైపు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తునకు తమిళ నాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశించారు. రిటైర్డ్ జడ్జి అరుణా జగదీశన్ నేతృత్వంలోని కమిషన్ ఘటన పై పూర్తి నివేదికను అందించనుంది.

**ఎక్స్‌గ్రేషియా ప్రకటన**

మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడ్డ వారికి రెండు లక్షలు చొప్పున విజయ్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. నా హృదయం ముక్కలైందని, భరించలేని బాధలో ఉన్నానని విజయ్ ఘటన గురించి ఇప్పటికే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## బీహార్, మరో 7 రాష్ట్రాలకు 470 మంది పరిశీలకులు

న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికలు, మరో ఏడు అసెంబ్లీ ఉప ఎన్నికలకు జనరల్, పోలీస్, ఎక్స్‌పెండిచర్ పరిశీలకులుగా 470 మంది అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదివారంనాడు నియమించింది. ఎన్నికలు సజావుగా, నిష్పక్షికంగా నిర్వహించేలా అధికారులు తమ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. 470 మంది అధికారుల్లో 320 మంది ఐఏఎస్‌లు, 60 మంది ఐపీఎస్‌లు, 90 మంది ఐఆర్ఎస్, ఐఆర్ఏఎస్, ఐసీఏఎస్ సర్వీసులకు చెందిన వారు ఉన్నారు. ఎన్నికల పరిశీలకులు బీహార్‌లోని నియోజకవర్గాలతో పాటు బుద్గాం, నగ్రోటా (జమ్మూ అండ్ కశ్మీర్), అంతా (రాజస్థాన్) ఘాట్‌సిలా (జార్ఖండ్), జూబ్లీ హిల్స్ (తెలంగాణ), తరన్ తారన్ (పంజాబ్), దంపా (జార్ఖండ్), నువాపడా (ఒడిశా)లో మోహరిస్తారు. రాజ్యాంగ నిర్దేశించిన ప్రకారం ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌కు పరిశీలకులు సహకరిస్తారని, ఎప్పటికిప్పుడు కమిషన్‌కు రిపోర్ట్ చేస్తుంటారని ఎలక్షన్ కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులలో తమకున్న సీనియారిటీ, సుదీర్ఘ అనుభవంతో ఎన్నికల సజావుగా జరిగేందుకు వీరంతా ఈసీకి సహకరిస్తారని, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లను నియమించామని పేర్కొంది. రాజ్యాంగంలోని 324వ నిబంధన, ప్రజా ప్రాతినిధ్య చట్టం -1951లోని సెక్షన్ 20బి కింద తమకు లభించిన ప్లీనరీ పవర్స్‌తో పరిశీలకులను నియమించినట్లు ఈసీ తెలిపింది.

## మళ్లీ భారీ ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టుల మృతి

రాయపూర్: ఛత్తీస్‌గఢ్ – ఒడిశా సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. కాంకేర్ జిల్లా దుమార్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారని నిఘా వర్గాల నుంచి ఆదివారం భద్రతా దళాలకు సమాచారం అందటంతో కూంబింగ్ చేపట్టాయి.

## ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని భద్రతా బలగాలు ఆదివారం నాడు భగ్నం చేశాయి. పాకిస్థాన్ ఆక్రమిత భాగం నుంచి భారత భూభాగంలోకి అడుగుపెట్టేందుకు ఉగ్రవాదులు ప్రయత్నించడంతో అప్రమత్తంగా ఉన్న భద్రతా బలగాలు కాల్పులు ప్రారంభించాయి. ఇరువైపులా హోరాహోరీ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులను బలగాలు హతమార్చాయి.

# అక్టోబర్ 2న ఖాదీ వస్త్రాలే ధరించండి: మోదీ

వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దేశ ప్రజలు స్వయం సమృద్ధి బాటలో నడవడం తప్పనిసరని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇందుకోసం స్వదేశీ తయారీ ఉత్పత్తులే విక్రయించాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన్కీ బాత్ 126వ కార్యక్రమంలో ఆదివారం మోదీ మాట్లాడుతూ.. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి.. ధరించాలని కోరారు. స్వాతంత్య్ర పోరాట సమయంలో స్వదేశీ ఉత్పత్తులపై మహాత్మా గాంధీ ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారన్నారు. కాలక్రమంలో ఖాదీకి ప్రజాదరణ క్షీణించినప్పటికీ.. గత 11 ఏళ్లుగా మళ్లీ ఖాదీ ఉత్పత్తి పెరిగిందని అన్నారు.

ప్రపంచ ఆర్థిక రంగం అస్థిరతను, అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో మిగతా దేశాల మాదిరిగానే మనం కూడా సొంత ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి పెద్దపీట వేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి దీనిపై దేశవ్యాప్త విప్లవానికి నడుం బిగించాలని, కేవలం భారతీయులు తయారు చేసిన వస్తువులనే కొనుగోలు చేయాలన్నారు.



**ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోగలరు..**

భారత నావికాదళానికి చెందిన ఇద్దరు అధికారిణులు, లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూపల ధైర్య సాహసాలను ప్రధాని మోదీ ప్రశంసించారు. సముద్ర గర్భంలో వారు చూపుతున్న తెగువను కొనియాడారు. భారత పుత్రికలు కఠినమైన పరిస్థితులను సైతం సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారన్నారు. మన్కీ బాత్లో భాగంగా వారిరువురితో ఫోన్లో సంభాషించారు. స్వాతంత్య్ర సమర యోధుడు భగత్ సింగ్, భారతరత్న, ప్రముఖ గాయని లతా మంగేష్కర్ల జయంతి సందర్భంగా ప్రధాని మోదీ వారికి శ్రద్ధాంజలి ఘటించారు. దేశ స్వాతంత్య్రం కోసం భగత్ సింగ్ ఉరికంబం ఎక్కారని.. దానికి ముందు ఆయన ఆంగ్లేయులకు లేఖ రాశారని అన్నారు. ఇందులో తమను ఉరి కంబాలకు బదులు తూటాలతో చంపాలని భగత్ సింగ్ కోరినట్లు తెలిపారు. ఆ లేఖ ఆయన సాహసానికి నిదర్శనమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భగత్ సింగ్ ఎప్పుడూ ముందుండే వారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని యువతకు సూచించారు. ప్రముఖ గాయని లతా మంగేష్కర్ పాడిన దేశభక్తి గీతాలు ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయన్నారు. భారతీయ సంస్కృతి, సంగీతంపై ఆసక్తి ఉన్న ఎవరైనా ఆమె పాటలను విని మంత్రముగ్ధులైపోతారని కొనియాడారు.

# ఢిల్లీ బాబా అరెస్ట్..మొబైల్స్ స్వాధీనం

న్యూఢిల్లీ: వసంత్‌కుంజ్ ప్రాంతంలోని శ్రీ శారదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న చైతన్యానంద సరస్వతిని ఢిల్లీ పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. ఆగ్రాలోని హోటల్ ఫస్ట్ తాజ్‌గంజ్ హోటల్‌లో బాబాను అరెస్టు చేసి లీగల్ ప్రొసీడింగ్స్ కోసం ఆదివారం ఉదయం ఢిల్లీకి తీసుకువచ్చారు. ఢిల్లీ కోర్టు ముందు హాజరుపరిచి తదుపరి విచారణ కోసం పోలీస్ కస్టడీని కోరనున్నారు. చైతన్యానంద సరస్వతి అలియాస్ పార్థసారథి.. శృంగేరి పీఠానికి అనుబంధంగా ఉన్న శ్రీ శారదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ కాలేజీలో చదువుతున్న పలువురు విద్యార్థినులను లైంగికంగా వేధించారనే ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల స్కాలర్‌షిప్ కింద పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సును ఈ కాలేజీ అందిస్తోంది.



**2 నకిలీ విజిటింగ్ కార్డులు**

ఢిల్లీ బాబా అరెస్టు సందర్భంగా ఆయన నుంచి రెండు నకిలీ విజిటింగ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిలో ఒకటి యునైటెడ్ నేషన్స్‌కు చెందిన కార్డు ఉంది. యుఎన్‌కు తాను శాశ్వత రాయబారిగా బాబా చెప్పుకుంటున్నారు. రెండో విజిటింగ్ కార్డుకు సంబంధించి తాను బ్రిక్స్ దేశాల జాయింట్ కమిషన్ సభ్యుడిగా, భారత ప్రత్యేక రాయబారిగా బాబా చెబుతున్నారు. కాగా, ఢిల్లీ బాబా నుంచి ఒక ఐఫోన్ సహా మూడు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచి పరారీలో ఉన్న ఆయన.. బృందావన్, ఆగ్రా, మధుర తో సహా 15 ప్రదేశాల్లో హోటళ్లు మారుతూ బస చేసినట్టు విచారణలో తేలింది. తన పలుకుబడిని చాటుకునేందుకు ఆయన ప్రధాన మంత్రి కార్యాలయం పేరును కూడా దుర్వినియోగ పరిచినట్లు చెబుతున్నారు. పార్థసారథి అలియాస్ చైతన్యానంద సరస్వతి కోసం హర్యానా, రాజస్థాన్, యూపీ, పశ్చిమబెంగాల్‌లోనూ గాలించినట్టు డీసీపీ సౌత్-వెస్ట్ అమిత్ గోయెల్ తెలిపారు. పెద్దఎత్తున ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై బాబాకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు ఇటీవల నిరాకరించింది.

# శిథిలమైపోయిన గాజా!



- రెండేళ్ల యుద్ధంలో మరణాలు 66వేలు
- 90శాతం పాలస్తీనియన్లు నిరాశ్రయం

అంతర్జాతీయంగా తీవ్రస్థాయిలో విమర్శలు ఎదురవుతున్నప్పటికీ.. గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపడం లేదు. దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న ఇజ్రాయెల్- హమాస్ యుద్ధం కారణంగా గాజాలో మృతుల సంఖ్య 66 వేలు దాటింది.

మరో 1.68 లక్షల మంది గాయపడ్డారని స్థానిక ఆరోగ్యశాఖ వెల్లడించింది. మృతుల్లో దాదాపు సగంమంది మహిళలు, చిన్నారులేనని అంచనా వేసింది. శిథిలాల కింద వేలాదిమంది చిక్కుకున్నట్టు భావిస్తోంది. గత 24 గంటల్లోనే 79మంది మరణించినట్టు తెలిపింది. అయితే.. మొత్తం మృతుల సంఖ్యలో సామాన్య పౌరులు, యుద్ధంలో పాల్గొన్నవారు ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు మెరుపుదాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా హమాస్ నెట్వర్క్ అంతమే లక్ష్యంగా టెల్‌అవీవ్ విరుచుకుపడుతోంది.

ఫలితంగా గాజా జనాభాలో దాదాపు 90 శాతంమంది నిరాశ్రయులుగా మారారు. మరణాలతోపాటు పెద్దఎత్తున విధ్వంసం, మానవతా సంక్షోభం, కరవుతో పరిస్థితులు మరింత దుర్భరంగా మారాయి. కొన్నిరోజులుగా గాజా సిటీ లక్ష్యంగా ఇజ్రాయెల్ తన దాడులను ముమ్మరం చేసింది. మరోవైపు.. ప్రపంచ దేశాలు నెతన్యాహు సర్కారు తీరును తీవ్రంగా తప్పుపడుతున్నాయి. ఇటీవల ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా దేశాలు పాలస్తీనాను దేశంగా గుర్తించాయి.

# ట్రంప్‌నకు పాక్ బిస్కెట్లు?

***బుట్టలో వేసుకోవడానికి పెట్టెనిచ్చిన వైనం - పాక్‌లోని రేర్ ఎర్త్ మినరల్స్ బహూకరణ***




అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను బుట్టలో వేసుకోవడానికి పాకిస్థాన్ నాయకులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. గతవారం పాక్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్ శ్వేతసౌధంలో ట్రంప్‌ను కలిశారు. ఈ సందర్భంగా ట్రంప్‌నకు ఓ చెక్కపెట్టెను బహూకరించారు. దానిలో పాక్‌లో వెలికి తీసిన అరుదైన ఖనిజాలున్నాయి. ఈ చిత్రాన్ని శ్వేతసౌధం విడుదల చేసింది. పాక్ ఆర్మీ చీఫ్ ఆ పెట్టెలోని రంగురాళ్లను చూపుతూ ఏదో చెబుతుండగా.. ట్రంప్ వాటిని ఆసక్తిగా చూస్తున్నట్టు అందులో ఉంది. రేర్ ఎర్త్ మినరల్స్‌లో చైనా ఆధిపత్యానికి గండికొట్టాలని ట్రంప్ ఎప్పటినుంచో చెబుతున్నారు. ఈ క్రమంలో రేర్ ఎర్త్ మినరల్స్ వెలికితీతపై అమెరికా ఆసక్తిగా ఉంది. దీనిలో భాగంగానే అమెరికాకు చెందిన ఓ కంపెనీ 500 మిలియన్ డాలర్లు పాక్‌లో పెట్టుబడి పెట్టేందుకు అంగీకరించింది. పాక్ సైన్యానికి చెందిన ఫ్రంటియర్ వర్క్స్ ఆర్గనైజేషన్- యూఎస్ స్ట్రాటజిక్ మెటల్స్ సంస్థ ఓ ఎంవోయూపై సంతకాలు చేశాయి. దీని ప్రకారం ఆ దేశంలో పాలీ మెటాలిక్ రిఫైనరీని ఏర్పాటు చేయనున్నారు. "పాకిస్థాన్ వద్ద రేర్ ఎర్త్ మినరల్స్ ఖజానా ఉంది. దీంతో దేశ రుణభారం చాలా వరకు తగ్గిపోనుంది. అతి త్వరలోనే పాక్ సుసంపన్న సమాజాల్లో ఒకటిగా మారుతుంది" అని మునీర్ స్థానిక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

# వాళ్లను మరింత సరిచేయాల్సి ఉంది

***భారత్‌పై మళ్లీ నోరు పారేసుకున్న లుట్నిక్ - ఎవరివైపు ఉండాలో తేల్చుకోవాలంటూ వ్యాఖ్యలు***

అమెరికా వాణిజ్యశాఖ మంత్రి హెూవార్డ్ లుట్నిక్ మరోసారి భారత్‌పై నోరు పారేసుకున్నారు. అమెరికాతో వాణిజ్య భాగస్వాములైన భారత్, బ్రెజిల్‌వంటి దేశాలు తమ గురించి మాట్లాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వారు తమ మార్కెట్లను తెరిచి.. అమెరికా ప్రయోజనాలకు హాని కలిగించే విధానాలను వెంటనే రద్దు చేసుకోవాలన్నారు. స్విట్జర్లాండ్, బ్రెజిల్, భారత్‌వంటి దేశాలను అగ్రరాజ్యం మరింత సరిచేయాల్సిన అవసరం ఉందని ఇంటర్వ్యూలో ప్రేలాపనలు చేశారు. ఆయా దేశాలు తమతో ఆలోచించి మాట్లాడాలన్నారు. రష్యా ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలుపెట్టాకే భారత్ రాయితీపై రష్యానుంచి ముడి చమురు కొనుగోళ్లు పెంచిందని హెూవార్డ్ లుట్నిక్ ఆరోపించారు. ఇప్పటికైనా ఎవరివైపు ఉండాలనే విషయంపై మోదీ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు.



లుట్నిక్ గతంలోనూ ఇదే విధంగా భారత్‌పై నోరుపారేసుకున్నారు. భారత్, కెనడా, బ్రెజిల్‌వంటి దేశాలు అమెరికాలో విక్రయాలు చేపడుతూ.. ప్రయోజనాలు పొందుతున్నారని.. కానీ, తమను మాత్రం ఆయా దేశాల్లో విక్రయాలు చేపట్టకుండా అడ్డుకుంటున్నాయన్నారు. ఏళ్ల తరబడి తాము ఈ సమస్యను ఎదుర్కొన్నాం కాబట్టే సుంకాలు విధించామన్నారు. తమతో వాణిజ్యం చేసే దేశాలు దీనిని అంగీకరించక తప్పదన్నారు. ఇరుదేశాల మధ్య సుంకాల వివాదం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. భారత్- అమెరికా మధ్య సుంకాల వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై టారిఫ్‌ను 50 శాతానికి పెంచారు. గత నెలనుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. అమెరికా అదనపు సుంకాలు సహేతుకం కాదని భారత్ ఇప్పటికే ఖండించింది. ఈ విషయంలో దేశ ప్రయోజనాలకు కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అయితే.. భారత్‌పై 50 శాతం సుంకాలు విధించడం అంత తేలికైన విషయం కాదని, రష్యాపై చర్యల కోసం ఢిల్లీతో విభేదానికి సిద్ధమయ్యామని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు.

## డిసెంబర్‌లో భారత్‌కు పుతిన్

**- భారత్ వ్యవహారాల్లో మేం జోక్యం చేసుకోం**

**- రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్**



ఈ ఏడాది చివరిలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించనున్నట్టు ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. అనంతరం భారత మీడియాతో మాట్లాడారు. డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారని లవ్రోవ్ తెలిపారు. ఇరు దేశాల మధ్య విస్తృతమైన ద్వైపాక్షిక అజెండా ఉందన్నారు. వాణిజ్యం, సైనిక, సాంకేతికత, కృత్రిమ మేధవంటి కీలక విషయాల్లో సన్నిహిత సంబంధాలున్నాయని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య జరిగే సాధారణ దౌత్య చర్చల్లో భాగంగా ఈ ఏడాదిలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాస్కోలో పర్యటించే అవకాశం ఉందని, తాను కూడా భారత్‌లో పర్యటిస్తానని వెల్లడించారు.

వాణిజ్యం, ఇంధన సంబంధిత అంశాల్లో భారత్ చర్యల్లో తాము జోక్యం చేసుకోమని లవ్రోవ్ స్పష్టం చేశారు. వీటిపై స్వయంగా నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం ఆ దేశానికి ఉందన్నారు. చమురు వాణిజ్య విధానాలపై భారత వైఖరిని కొనియాడారు. ఈ సందర్భంగా చమురు కొనుగోళ్లపై ఇంతకుముందు జైశంకర్ పేర్కొన్న విషయాలను లవ్రోవ్ మరోసారి ప్రస్తావించారు. అమెరికా తన చమురును అమ్మాలనుకుంటే, దీనికి సంబంధించిన నిబంధనలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని జైశంకర్ పేర్కొన్నట్లు తెలిపారు. కానీ, యూఎస్‌తో కాకుండా రష్యా లేదా ఇతర దేశాలతో వాణిజ్యం కొనసాగించడం అనేది తమ సొంత విషయమని ఆయన తెలిపినట్టు వెల్లడించారు. దీనిని ఉదహరిస్తూ భారత్ ఆత్మగౌరవంపై వ్యాఖ్యానించే అవకాశం ఎవరికీ ఉండదని లవ్రోవ్ పేర్కొన్నారు.

## ఇరాన్‌కు మళ్లీ గడ్డుకాలం

**ఆంక్షలు పునరుద్ధరించిన ఐరాస**

ఇరాన్ అణు కార్యక్రమంపై ఆంక్షలను ఐరాస పునరుద్ధరించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. దీంతో ఇప్పటికే ఆహారం, నిధుల కొరత ఎదుర్కొంటున్న ఆ దేశం మరింత కష్టాల్లోకి జారనుంది. ఆంక్షలను ఆపేందుకు చివరి నిమిషం వరకు ఇరాన్ ప్రయత్నించినా విఫలమైంది. ఐరాస ఆంక్షల ప్రకారం.. ఇరాన్‌కు విదేశాల్లో ఉన్న ఆస్తులను స్తంభింపజేయడం, ఆయుధ డీల్స్‌ను నిలిపివేయడం వంటివి చేయనున్నారు. ఇరాన్ బాలిస్టిక్ మిసైల్ ప్రోగ్రాంపై చర్యలు తీసుకోవడం కూడా ఈ జాబితాలో ఉంది. నిజానికి అక్టోబర్ 18తో ఆంక్షలు శాశ్వతంగా తొలగిపోవాల్సి ఉంది. అయితే గతంలో జరిగిన జాయింట్ కాంప్రహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ (జేసీపీఓఏ) ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించింది. దీంతో ఆంక్షలు ఎదుర్కోవాల్సి వచ్చింది.

జేసీపీఓఏ ఒప్పందం ప్రకారం.. అందులో సంతకం చేసిన ఏ దేశమైనా అవసరమైతే ఆంక్షలను పునరుద్ధరించవచ్చు. ఈ నేపథ్యంలో టెహ్రాన్ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఐరోపా దేశాల ప్రతినిధులు ఆగస్టులోనే ఐరాసకు వెల్లడించారు. జర్మనీ, యూకే 30 రోజుల క్రితమే ఆంక్షలను పునరుద్ధరించాలని నిర్ణయించాయి. దీనికితోడు ఈ ప్రక్రియను ఐరాస భద్రతా మండలి వీటో చేయడానికి వీల్లేకుండా డిజైన్ చేశారు. దీంతో చైనా, రష్యా ఈ విషయంలో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడుతూ ఈ ఆంక్షలు ఇరాన్‌కు ఉచ్చుగా అభివర్ణించారు.

## ముగ్గురి ప్రాణాలు తీసిన గన్ ఫైర్

**- అమెరికాలో మరోసారి దారుణం**



అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం రేగింది. నార్త్ కరోలినాలోని అమెరికన్ ఫిష్ కంపెనీ రెస్టారెంట్ సమీపంలో శనివారం రాత్రి కాల్పుల ఘటన చోటు చేసుకుంది. ఇందులో ముగ్గురు మృతి చెందగా.. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. అధికారుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని బోటు నార్త్ కరోలినాలోని సౌత్ పోర్ట్ యాచ్ బేసిన్‌లోవున్న అమెరికన్ ఫిష్ కంపెనీ రెస్టారెంట్ వద్దకు వచ్చింది. బోటులోని వ్యక్తి ఒక్కసారిగా రెస్టారెంట్‌పైకి కాల్పులకు పాల్పడ్డాడు. ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. పలువురికి గాయాలైనట్టు సమాచారం. కాల్పుల అనంతరం దుండగుడు అదే బోటులో పారిపోయినట్టు అధికారులు పేర్కొన్నారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టామని.. దాడికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. మృతులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# భారత్‌కు.. వీర 'తిలక్'ం!



- మనదే ఆసియా కప్
- ఫైనల్‌లో పాక్ చిత్తు
- టోర్నీలో చివరి వరకూ అజేయంగా టీమిండియా
- తిప్పేసిన కుల్‌దీప్

తిలక్‌వర్మ వీరోచిత ఇన్నింగ్స్‌తో ఆసియా కప్‌ను టీమిండియా గెలుచుకుంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై అదిరే విజయం సాధించి భారత్ ఆసియా కప్ విజేతగా నిలిచింది. ఆదివారం దుబాయ్‌లో ఉత్కంఠగా సాగిన ఫైనల్ పోరులో దాయాది జట్టుపై టీమ్ ఇండియా 5 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత బౌలర్లు విజృంభించడంతో పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగు దిగిన భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తిలక్ వర్మ (69నాటౌట్: 53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. శివమ్ దూబె (33: 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) చెలరేగాడు.

**ఒత్తిడి నుంచి తేరుకొని..**

147 పరుగుల స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్కు దిగిన భారత్కు ఆదిలోనే షాక్ తగిలింది. ఈ టోర్నీలో సూపర్ ఫామ్లో ఉన్న అభిషేక్ శర్మ (5) రెండో ఓవర్ తొలి బంతికి ఔటయ్యాడు. ఫహీమ్ అష్రఫ్ బౌలింగ్ రవూఫ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన సూర్య (1) షహీన్ అఫ్రిది బౌలింగ్లో సల్మాన్ అఘాకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఇక టీమ్ ఇండియా 20 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయింది. నాలుగో ఫహీమ్ అష్రఫ్ బౌలింగ్ లో నాలుగో ఓవర్ చివరి బంతికి రవూఫ్‌కు క్యాచ్ ఇచ్చి గిల్ (12) పెవిలియన్ చేరాడు. దీంతో భారత్ నాలుగో ఓవర్లకు ముగిసే సరికి 25/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సంజూ శాంసన్ (24: 21 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్స్) తో కలిసి తిలక్ వర్మ (37: 36 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. అడపాదడపా బౌండరీలతో వీరు స్కోర్ బోర్డును ముందుకు కదిలించారు. 10 ఓవర్లకు భారత్ స్కోర్ 58 పరుగులుగా ఉంది. ఈ జోడీ ప్రమాదకరంగా మారుతున్న తరుణంలో జట్టు స్కోర్ 77 పరుగుల వద్ద అబ్రార్ బౌలింగ్లో శాంసన్ క్యాచ్ ఔటయ్యాడు. దీంతో 52 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. శాంసన్ అనంతరం కొంచెం స్కోర్ నెమ్మదించింది. అయితే 15వ ఓవర్లో భారత బ్యాటర్లు జూలు విదిలించారు.

హారిస్ రవూఫ్ బౌలింగ్ తొలుత దూబె ఫోర్ బాదగా అనంతరం తిలక్ వర్మ ఒక ఫోర్, సిక్స్ కొట్టాడు. దీంతో ఈ ఓవర్లో 17 పరుగులు వచ్చాయి. 15 ఓవర్లు పూర్తయ్యే సరికి భారత్ 100/4తో నిలిచింది. 16వ ఓవర్ తొలి బంతికి దూబె సిక్స్ బాదాడు. ఈ ఓవర్లో చివరి బంతికి తిలక్ సింగిల్ తీసి అర్ధశతకం నమోదు చేశాడు.

ఈ ఓవర్లో మొత్తం 11 పరుగులు వచ్చాయి. దీంతో విజయ సమీకరణం 4 ఓవర్లలో 36 పరుగులుగా మారింది. 17వ ఓవర్లో కేవలం 6 పరుగులే రావడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. అయితే 18 ఓవర్ చివరి బంతికి దూబె సిక్స్ బాదాడు. దీంతో ఈ ఓవర్లో మొత్తం 13 పరుగులు వచ్చాయి. భారత్ విజయ లక్ష్యం 12 బంతుల్లో 17 పరుగులుగా మారింది. 19 ఓవర్లో చివరి బంతికి దూబె భారీ షాట్ కొట్టగా, షహీన్ అఫ్రిది బౌండరీ వద్ద క్యాచ్ అందుకున్నాడు. ఈ ఓవర్లో కేవలం 7 పరుగులే వచ్చాయి. దీంతో సమీకరణం 6 బంతుల్లో 10 పరుగులు మారింది. తొలి బంతికి రెండు పరుగులు రాగా, రెండో బంతిని తిలక్ సిక్స్‌గా మలిచాడు. నాలుగు బంతికి రింకు సింగ్ ఫోర్ కొట్టడంతో భారత్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

**తిప్పేసిన కుల్‌దీప్**

టాస్ గెలిచిన టీమ్ ఇండియా బౌలింగ్ ఎంచుకోగా మరోసారి కుల్‌దీప్ యాదవ్ మాయాజాలం ముందు పాక్ బ్యాటర్లు చేతులెత్తేశారు. ఆదిలో కాస్త నిలకడగా ఆడినప్పటికీ.. భారత స్పిన్నర్ల ధాటికి వెనువెంటనే కీలక వికెట్లు కోల్పోయింది. దీంతో పాక్ 19.1 ఓవర్లలోనే 146 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కుల్‌దీప్ 4 వికెట్లు తీయగా.. వరుణ్ చక్రవర్తి, అక్షర్, బుమ్రా తలో రెండేసి వికెట్లు తీశారు.

పాకిస్థాన్ ఓపెనర్లు ఫర్హాన్, ఫకర్ జమాన్ పవర్ ప్లేలో నిలకడగా ఆడి వికెట్ నష్టపోకుండా 45 పరుగులు చేశారు. కాస్త దూకుడుగా ఆడి అర్ధ శతకం పూర్తి చేసుకున్న ఫర్హాన్ (57).. వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన సైమ్ అయూబ్ (14) కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో 113 పరుగుల వద్ద రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ వెంటనే మహమ్మద్ హారిస్ కూడా పరుగులేమీ చేయకుండా వెనుదిరిగాడు. ధాటిగా ఆడుతున్న మరో ఓపెనర్ ఫకర్ జమాన్ (46) కూడా వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఇక 17వ ఓవర్లో కుల్‌దీప్ విజృంభించాడు. ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి పాక్‌ను చావుదెబ్బ తీశాడు.

**టాస్ టైమ్ లో డ్రామా..**

టాస్ సమయంలో కాస్త డ్రామా చోటుచేసుకుంది. టాస్ గెలిచిన టీమ్ ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆ సమయంలో వ్యాఖ్యాతగా ఉన్న రవిశాస్త్రి... సూర్యతో మాట్లాడాడు. ఆ తర్వాత పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘాతో టాస్ ఇంటర్వ్యూ తీసుకునేందుకు ఇష్టపడలేదు. దీంతో మరో వ్యాఖ్యాత వఖార్ యూనిస్.. అఘాతో ఇంటర్వ్యూ కొనసాగించాడు. ఇద్దరు కెప్టెన్లతో మాట్లాడేందుకు ఇద్దరు వ్యాఖ్యాతలు వచ్చారు. ఇలా టాస్ సమయంలో ఇద్దరు వ్యాఖ్యాతలు రావడం ఇదే తొలిసారిని పలువురు పేర్కొంటున్నారు.

## బీసీసీఐ చీఫ్‌గా మిథున్ మన్హాస్



ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ బోర్డు బీసీసీఐకి కొత్త అధ్యక్షుడు వచ్చారు. మొన్నటి వరకూ ఈ పదవిలో ఉన్న రోజర్ బిన్నీ స్థానంలో మాజీ క్రికెటర్ మిథున్ మన్హాస్ ఎంపికయ్యారు. ముంబయిలో ఆదివారం జరిగిన బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) 37వ అధ్యక్షుడిగా మన్హాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేశవాళీలో ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మిథున్ మన్హాస్ ఇంత వరకు ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడకపోవడం గమనార్హం. 45 ఏళ్ల మన్హాస్ ఢిల్లీ తరపున 157 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు, 130 లిస్ట్-ఏ మ్యాచ్లు ఆడాడు. అతడు 55 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో కూడా బరిలోకి దిగాడు.

**అపెక్స్ కౌన్సిల్లోకి మరో ఇద్దరు**

బీసీసీఐ అధ్యక్ష, ఉపాధ్యక్షుడి పదవులతోపాటు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, ట్రెజరర్ స్థానాలకు ఒకే ప్యానెల్ నామినేషన్ దాఖలు చేసింది. దీంతో మిథున్ మన్హాస్ అధ్యక్షుడు కాగా.. బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా, కార్యదర్శిగా దేవజిత్ సైకియా మరోసారి ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా ప్రభజ్ సింగ్ భాటియా, కోశాధికారిగా రఘురామ్ భట్ ఎన్నికైనట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అపెక్స్ కౌన్సిల్లో ఇప్పటి వరకు జయేవ్ నిరంజన్ ఏక సభ్యుడిగా ఉన్నారు. ఇప్పుడు మరో ఇద్దరిని బీసీసీఐ ఏజీఎం ఎంపిక చేసింది. ఐపీఎల్ చైర్మన్‌గా ఉన్న అరుణ్ ధుమాల్ తోపాటు కైరుల్ జమాల్ మజుందార్ కూడా గవర్నింగ్ కౌన్సిల్లోకి వచ్చారు.

**ఆసియా కప్ ఫైనల్‌కు వెళ్లలేదు..**

భారత్ – పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్‌కి భారత క్రికెట్ బోర్డు నుంచి ఎవరూ హాజరు కాలేదు. ఏజీఎం ఉండటంతోపాటు కొత్త కార్యవర్గం పదవీ బాధ్యతలు స్వీకరిస్తుండటంతో దుబాయ్ వెళ్ల లేదని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

## ఐపీఎల్‌లో ఆడాలంటే... బీసీసీఐ కొత్త నిబంధన

ఐపీఎల్‌లో ఆటగాళ్ల ఎంపిక కోసం బీసీసీఐ కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఈ టోర్నీలో యువ ఆటగాళ్లు ఆడాలనుకుంటే. తప్పనిసరిగా ఒక ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడి ఉండాలనే రూల్ ప్రవేశపెట్టింది. ఈ నిబంధన ప్రకారం అండర్-16, అండర్ -19 ప్లేయర్లు ఐపీఎల్‌కు అర్హత సాధించాలంటే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒక్క మ్యాచ్ అయినా ఆడిన అనుభవం తప్పనిసరి. ఆదివారం జరిగిన బోర్డు సర్వసభ్య సమవేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఐపీఎల్ సీజన్ నుంచి ఈ కొత్త నిబంధన అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. అంటే.. ఇక మీదట యువ ఆటగాళ్లు నేరుగా ఐపీఎల్లోకి రావడానికి వీల్లేదు. వారు తమ రాష్ట్రం తరపున కనీసం ఒక్క ఫస్ట్ క్లాస్ మ్యాచ్లోనైనా ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది. దేశీయ క్రికెట్‌ను బలోపేతం చేసే దిశగా బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

కాగా ఐపీఎల్ లో ఇప్పటికే ఎంతో మంది అండర్-19 ఆటగాళ్లు తమ ప్రతిభను నిరూపించుకున్న విషయం తెలిసిందే. అయితే, బీహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ మాత్రం పదమూడేళ్ల 243 రోజుల వయసులోనే ఐపీఎల్ వేలంలో అమ్ముడుపోయాడు.

ఐపీఎల్ వేలం-2025 సందర్భంగా వైభవ్‌ను రాజస్థాన్ రాయల్స్ ఏకంగా రూ. 1.10 కోట్లకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అయితే, అంతకంటే ముందే వైభవ్ సూర్యవంశీ దేశీ జట్టు తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాడు. రంజీల్లో చిన్న వయసులోనే అరంగేట్రం చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇక వైభవ్‌తో పాటు.. మహారాష్ట్రకు చెందిన ఆయుశ్ మాత్రే కూడా ఇదే కోవకు చెందుతాడు. ఇప్పటికే రంజీల్లో ఆడుతున్న ఆయుశ్.. ఐపీఎల్-2025లో చెన్నై సూపర్ కింగ్స్ కు ప్రాతినిధ్యం వహించారు.

అయితే... ఇకపై ఐపీఎల్ లోకి రావాలంటే అండర్-16, అండర్-19 ప్లేయర్లు కనీసం ఒక్క ఫస్ట్ క్లాస్ మ్యాచ్ అయినా ఆడాలని బీసీసీఐ తాజాగా నిర్ణయించింది. అంతకుముందు ఈ నిర్ణయం ఫ్రాంచైజీల చేతుల్లో ఉండేది. అండర్-16, 19 స్థాయిల్లో తమకు నచ్చిన ఆటగాళ్లను ఫ్రాంచైజీలు ఎంచుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు మాత్రం అలా కుదరదు.

## కోహ్లి పోస్ట్.. ఇంటర్నెట్ షేక్




టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఫాలోయింగ్ గురించి చెప్పాలంటే మాటలు చాలవు. సోషల్ మీడియాలో ఆయన ఒక పోస్ట్ పెడితే చాలు.. స్వల్ప వ్యవధిలోనే లక్షల కొద్దీ లైకులు వస్తాయి. టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికి కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్న అతడు.. ప్రస్తుతం కుటుంబంతో కలిసి లండన్‌లో ఉంటున్నాడు. త్వరలో జరగ బోయే ఆస్ట్రేలియాతో వన్డే సిరీసుకు సిద్ధమవుతున్నాడు. కోహ్లి తాజాగా ఇన్‌స్టాలో ఓ పోస్టు పెట్టగా అది వైరల్ గా మారింది. తన సతీమణి అనుష్క శర్మతో కలిసి ఉన్న ఒక ఫొటోను అభిమానులతో పంచుకున్నాడు. "చాలా కాలం తర్వాత.." అంటూ దానికి క్యాప్షన్ ఇచ్చాడు. దీంతో ఈ పోస్టు ఇంటర్నెట్‌ను షేక్ చేసింది. పోస్టు పెట్టిన 15 గంటల్లోనే దీనికి 9 మిలియన్లకు పైగా లైక్స్ వచ్చాయి. ఇక కోహ్లి చివరిసారిగా ఐపీఎల్లో కనిపించిన విషయం తెలిసిందే. తన జట్టు ఆర్సీబీకి తొలి టైటిల్‌ను అందించి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాడు.

# ఆమే.. నా విజయ రహస్యం



తాను సాధించిన విజయాలన్నింటికీ భార్య షాలినియే కారణమంటూ నటుడు అజిత్ మరోసారి ప్రేమను చాటుకున్నారు. తన ప్రతి విజయం వెనుక ఆమె ప్రోత్సహం ఉందంటూ ప్రశంసలు కురిపించారు. వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాన్ని ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారన్న అంశంపై ఓ ఇంటర్వ్యూలో అజిత్ ఈ వ్యాఖ్యలు చేశారు. "షాలిని ఎన్నో పనులు చక్కబెడుతుంటుంది. ఆమె మద్దతు లేకపోతే నేను ఇదంతా చేయగలగేవాడిని కాదు. మాకు 2002లో పెళ్లైయింది. ఆ సమయంలోనే రేసింగ్‌కు తిరిగొచ్చా. షాలిని కూడా నాతోపాటు వచ్చేది. పిల్లలు పుట్టాక తను బిజీ అయిపోయింది. అయినా మోటార్ స్పోర్ట్‌ను ఫాలో అవుతూనే ఉంది. నా కొడుకుకూ రేసింగ్ ఇష్టం. ప్రస్తుతం గో- కార్టింగ్ (లైట్ వెయిట్ వెహికల్స్ రేసింగ్) ప్రారంభించాడు. రేసింగ్‌ను కొనసాగిస్తాడో, లేదో? నిర్ణయించుకోవడానికి కొంత సమయమిస్తా. సినిమాలైనా, రేసింగ్ అయినా నా అభిప్రాయాలను పిల్లలపై రుద్దను. తమంతట తామే నచ్చిన రంగంలోకి అడుగుపెట్టాలని కోరుకుంటా. నాకు వీలైనంత సపోర్ట్ చేస్తా. వృత్తిపరంగా నేను ఎక్కడెక్కడికో వెళుతుంటా. దానివల్ల పిల్లలను మిస్ అవుతుంటా. దేనినైనా అమితంగా ప్రేమించినప్పుడు కొన్ని త్యాగాలు చేయాలి" అని పేర్కొన్నారు. అజిత్ ప్రొఫెషనల్ రేసర్ అన్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరిలో జరిగిన 24 హెచ్ దుబాయ్ కారు రేసింగ్‌లో అజిత్ పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆ పోటీల్లో అజిత్ టీమ్ మూడోస్థానాన్ని కైవసం చేసుకుంది. ఇటలీలో ఇటీవల జరిగిన 12 హెచ్ రేస్‌లోనూ మూడోస్థానం దక్కించుకుంది. ఈ సంవత్సరం.. 'పట్టుదల', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలతో అజిత్ ప్రేక్షకులను పలకరించారు. త్వరలోనే కొత్త సినిమాని అధికారికంగా ప్రకటించనున్నారు.

# ఇదీ.. అసలైన ఆరంభం




హీరో రామ్‌చరణ్ ఇండస్ట్రీకి వచ్చి 18 ఏళ్లు పూర్తైన సందర్భంలో -'పెద్ది' టీం విషెస్ చెప్తూ స్పెషల్ పోస్టర్‌ను వదిలింది. "మా 'పెద్ది' 18ఏళ్ల సినీ కెరీర్‌ను పూర్తి చేసుకోవడం సంతోషం. తెరపై ఘనమైన వారసత్వం కొనసాగిస్తూనే బయట ఎంతో వినయ విధేయతలు కలిగి ఉండటమే కాకుండా, తనకంటూ ప్రత్యేకమైన పంథాను ఏర్పాటు చేసుకున్నాడు. మాకెన్నో అద్భుతమైన ఉత్సాహాన్ని కలిగించే సందర్భాలను ఇచ్చాడు. 'పెద్ది'నుంచి చాలా పెద్ద సర్‌ప్రైజ్‌లు మొదలు కాబోతున్నాయి" అని పేర్కొంది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'చిరుత'తో వెండితెరకు పరిచయమైన చరణ్ డ్యాన్సులు, ఫైట్స్‌తోపాటు, 'రంగస్థలం' చిత్రంలో తనదైన నటనతో తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు. ప్రస్తుతం చరణ్ హీరోగా రూపొందుతున్న మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ 'పెద్ది'. బుచ్చిబాబు దర్శకుడు. జాన్వీకపూర్ కథానాయిక.

శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న మూవీ ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ కథతో రానుంది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న 'పెద్ది'లో కన్నడ నటుడు శివరాజ్‌కుమార్‌తోపాటు, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. అగ్ర కథానాయకుడు చిరంజీవి కూడా తనయుడు చరణ్‌కు శుభాకాంక్షలు చెప్పారు. "చరణ్, 18 ఏళ్ల క్రితం 'చిరుత'తో మొదలైన నీ సినీ ప్రయాణం, నేడు కోట్లాది అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచినందుకు ఎంతగానో సంతోషిస్తున్నా. నిన్ను తెరపై హీరోగా చూసిన ఆ క్షణం.. నాన్నగా నేను ఎప్పటికీ మరచిపోలేను. నీ క్రమశిక్షణ, కృషి, పట్టుదల, వినయం, అంకితభావం నిన్ను ఇండస్ట్రీలో మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి. తండ్రిగా నేను నిన్ను చూసి ఎప్పుడు గర్వపడుతుంటా.. తెలుగు ప్రేక్షకుల అభిమానంతో, దేవుని దీవెనలతో మరెన్నో శిఖరాలు నువ్వు అధిరోహించాలి' అని కోరుకుంటూ.. విజయోస్తు..' అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.



# 'వరాహరూపం' గుర్తుచేస్తూ...

'వరాహరూపం.. 'కాంతార'లోని ఈ పాట ఎంతటి ఆదరణ సొంతం చేసుకుందో, అంతే వార్తల్లోనూ నిలిచింది. ఇప్పుడు దాన్ని గుర్తు చేసేలా మరో పాట సిద్ధమైంది. రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కాంతార చాప్టర్1'. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న మూవీ దసరా కానుకగా అక్టోబరు 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ చిత్రంలో 'బ్రహ్మ కలశ' అంటూ సాగే ఆడియో సాంగ్‌ను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. అజనీష్ లోకనాథ్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం సమకూర్చారు. అబ్బి వి ఆలపించారు. 'వరాహరూపం' థీమ్‌తో మొదలైన మ్యూజిక్ ఆద్యంతం అలరించింది. పాటను వింటున్నంతసేపూ 'వరాహరూపం' పాట మదిలో మెదలడం ఖాయం.

# దేవర-2లో శింబు?



ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'దేవర'కు సీక్వెల్ ఉంటుందని ఇప్పటికే అధికారిక ప్రకటన విడుదలైంది. ఈ నేపథ్యంలో సీక్వెల్‌పై భారీ అంచనాలే నెలకొన్నాయి. డిసెంబర్‌లో షూట్ స్టార్ట్ కాబోతుందనీ తాజాగా క్లారిటీ వచ్చింది. ఈ నేపథ్యంలో కొరటాల స్క్రిప్ట్‌లో భారీ మార్పులు చేశారన్న టాక్ బలంగా వినిపిస్తోంది. ఓ కీలక పాత్రను తమిళ హీరో శింబుతో చేయించేందుకు -ఆ రోల్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారట. దేవర పార్ట్-2 కోసం పాన్ ఇండియా వైడ్‌గా కొన్ని కొత్త ఎలిమెంట్స్‌ను దర్శకుడు కొరటాల యాడ్ చేశారన్నది మరో టాక్. ఇవన్నీ ఎంతవరకూ నిజాలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సీక్వెల్ పార్టులో జాన్వీకపూర్‌తోపాటు మరో హీరోయిన్ కూడా కనిపంచే చాన్సెస్ లేకపోలేదు. సైఫ్ అలీ ఖాన్ విలన్ పాత్ర పోషించనున్నారు. అనిరుధ్ మ్యూజిక్ అందించనున్నారు. మొత్తానికి సీక్వెల్‌పై దర్శకుడు కొరటాల హైప్‌ను పెంచుతున్నారు.

# ఆ కాంట్రవర్సీ పోస్టు ఫేక్



ఇటీవల సౌత్ సినిమా దగ్గర ఒక్క సినిమాతోనే ఫేట్ మార్చుకున్న అతి కొద్దిమంది హీరోయిన్లలో డ్రాగన్ బ్యూటీ కయాదు లోహర్ ఒకరు. యంగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ సరసన నటించిన బ్యూటీ ఆ సినిమాతో స్టార్ అయ్యింది. ఇక అక్కడనుంచి పలు సినిమాలు వరుసగా చేస్తున్న తాను తన పేరిట సోషల్ మీడియాలో జరుగుతున్న ఫేక్ ప్రచారంపై స్పందించింది. ఎక్స్ (ట్విట్టర్) యాప్‌లో తన పేరిట పలు పోస్టులు ఇటీవల చాలామందికి షాకింగ్‌గా అనిపించాయి. నిన్న తమిళనాట జరిగిన నటుడు విజయ్ రాజకీయ సభకి సంబంధించిన విషాదంపై ఓ కాంట్రవర్సీ పోస్ట్ కూడా రావడంతో దానిని ఆమెనే చేసింది అని చాలామంది అనుకున్నారు. కానీ కయాదు తన ఒరిజినల్ అకౌంట్ నుంచి పోస్ట్ చేసి తన పేరిట జరుగుతున్న ఫేక్ అకౌంట్ ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని తేల్చింది. నిజానికి ఆ సభ విషయంలో జరిగిన విషాదంపట్ల చాలా చింతిస్తున్నాను అని దయచేసి తన పేరు మీద జరుగుతున్న అలాంటి ప్రచారాలు ఎవరూ నమ్మవద్దని ఆమె ఓ క్లారిటీ అందించింది.

# ఈ 'కానిస్టేబుల్' గెలుస్తాడు



నిజాయతీ కలిగిన కానిస్టేబుల్ జీవితమే ఇతివృత్తంగా చిత్రాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు నటుడు, దర్శక నిర్మాత ఆర్ నారాయణమూర్తి. హైదరాబాద్‌లో 'కానిస్టేబుల్' చిత్రంలోని భావోద్వేగ ప్రధానమైన పాటని విడుదల చేశారు. వరుణ్ సందేశ్, మధులిక వారణాసి లీడ్‌రోల్స్ చేస్తున్నారు. జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై బలగం జగదీశ్ నిర్మించారు. ఆర్యన్ సుభాన్ ఎస్‌కె దర్శకుడు. అక్టోబరు 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ "దేశ సరిహద్దుల్లో జవాన్లు, దేశం లోపల పోలీసులు ప్రజల్ని రక్షించేందుకు ప్రాణాల్ని ఫణంగా పెట్టి శ్రమిస్తుంటారు. సమాజంలో పోలీసుల పాత్ర అనిర్వచనీయమైనది. చట్టాన్ని కాపాడుతూ, నిజాయతీగా పనిచేసే పోలీసులు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంటారు. అలాంటి ఓ కానిస్టేబుల్ కథతోనే చిత్రం రూపొందింది. నేను విడుదల చేసిన పాట బాగుంది. ఆస్కార్ గ్రహీత చంద్రబోస్ ఈ పాటని ఆలపించి రక్తికట్టించారు. వరుణ్ సందేశ్‌కు ఇది పూర్వ వైభవాన్ని తెచ్చే చిత్రం కావాలి" అన్నారు. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ "నేను ఇంతవరకూ పోషించిన పాత్రలకి పూర్తి భిన్నంగా ఇందులో కనిపిస్తాను. డ్రామా, సస్పెన్స్ థ్రిల్లింగ్ అంశాలతోపాటు, భావోద్వేగాలు, హాస్యం ఉన్న చిత్రమిది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "సమాజంలో స్ఫూర్తిని నింపే కథ ఇది. తప్పకుండా ఈ చిత్రం ప్రేక్షకుల మనసుల్ని గెలుస్తుంది" అన్నారు.

# కావాల్సినంత కామెడీ.. కె.ర్యాంప్



కుటుంబమంతా కలిసి చూసేలా 'కె ర్యాంప్' సినిమా ఉంటుందంటున్నాడు హీరో కిరణ్ అబ్బవరం. ఒకట్రెండు సంభాషణల్ని విని సినిమాపై ఎవ్వరూ ఒక అభిప్రాయానికి రావొద్దన్నారు. కి.అబ్బవరం లీడ్‌రోల్‌గా నటించిన చిత్రమే 'కె-ర్యాంప్'. యుక్తి తరేజా కథానాయిక. వీకే నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషించారు. జైన్స్ నాని దర్శకుడు. రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మాతలు. దీపావళి సందర్భంగా వచ్చే నెల 18న సినిమా విడుదల కానుంది. చిత్రబృందం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "నేనొక అల్లరి చిల్లరి కుర్రాడిగా కనిపిస్తా. కథానాయికేమో ఎప్పుడు ఎలా వ్యవహరిస్తుందో తెలియని గాల్‌ఫ్రెండ్. అందుకే కథానాయకుడు ఎప్పుడూ ఆవేశంగా కనిపిస్తుంటాడు. వాళ్లిద్దరి మధ్య సన్నివేశాలు థియేటర్లలో అందరినీ నవ్విస్తాయి. దర్శకుడు కథ చెబుతున్నంతసేపూ నవ్వుతూనే ఉన్నా. అది పక్కాగా తెరపైకి వచ్చింది. ప్రేక్షకులకు కావల్సినంత వినోదంతో రూపుదిద్దుకున్న 'కె-ర్యాంప్' తప్పకుండా ఆకట్టుకుంటుంది" అన్నారు. నటుడు వీకే నరేశ్ మాట్లాడుతూ "ఇప్పటివరకూ చేయని ఒక కొత్త తరహా పాత్రని పోషించా" అన్నారు.

యుక్తి తరేజా మాట్లాడుతూ "కథానాయిక పాత్ర పిచ్చిగా వ్యవహరించినా, దానికొక లెక్క ఉంటుంది. ఆ పాత్రని తెరపై చూసి ఆస్వాదించాల్సిందే" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కె-ర్యాంప్ అనే పేరులో చెడు అర్థం లేదు. కిరణ్ అబ్బవరం ర్యాంప్ అనే మాటని దృష్టిలో ఉంచుకుని కథ రాశా. తను ఇందులో కుమార్ అనే పాత్రని చేశాడు" అన్నారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ "ఈ దీపావళికి ఎంత పోటీ ఉన్నా మా సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం" అన్నారు.